
రాజయోగసారము



తరిగొండ వెంగమాంబ

శ్రీరస్తు
తరిగొండ వెంకమాంబాకృత

రాజయోగసారము

ద్విపదకావ్యము

చెన్నపురి:
వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే
బ్రకటితము.

1950

Printed by
V. Venkateswara Sastrulu of
V. Ramaswamy Sastralu & Sons
at the Vavilla Press
Madras—1950.

శ్రీ ర స్తు

రాజయోగసారము

ప్రథమ ప్రకరణము

శ్రీగణనాథు నాశ్రితపరిపాలు
నాగమసంవేద్యు నాధారసదను
ననిశంబుఁ గీర్తించి యతిభక్తి మెఱయ
ననువుగఁ దఱికుండహరిని మహాను
భావుని భవ్యరూపాంచితు నెంచి
పావనమూర్తిని బరమపావనుని
వేదాంతవేద్యుని విశ్వతోముఖుని
నాదవినోదిని నలినలోచనుని
నాదినారాయణు ననిశంబు మదిని
మోదంబుతో మర్మమును దగుత్రోవ
యందుంచి యచలతత్వార్థంబుసరణిఁ
బొందించి భావించి పుణ్యప్రయుక్త
ఘనత యెసంగు గంగాయమునలకు
ననుపొందుమధ్యయౌ నాడికాగ్రమునఁ
జెలువారు ఘనమేరుశిఖరంబునందు
లలిని విజ్ఞప్తికళామాత్రుఁ డగుచుఁ
బరుఁ డౌచు వెల్గు సుబ్రహ్మణ్యగురుని
చరణరేణుచయంబు సారెసారెకును
శిరమున ధరియించి చిరభక్తిఁ బెంచి
పరమరహస్యంబు భావమం దుంచి

రహి మీర సోమేశ్వరస్వామిఁ దలఁచి
మహితముక్తిప్రదమార్గమునొందు
కొఱకు విద్యారణ్యగురుని భజించి
వఱల బ్రహ్మేంద్రులఁ బ్రస్తుతి చేసి
ఘనత మీర స్వయంప్రకాశులఁ దలఁచి
యనఘాత్ముఁ డగుసచ్చిదానందగురుని
కారణుం డగుమల్లికార్జునగురుని
ధీరుఁడౌ నవధూతదేశికోత్తముని
నచలితపరమహంసాఖ్యసద్గురుని

నచలభక్తుని బడబానలగురుని
నలరు సుజ్ఞానయోగానందగురుని
నిల ధన్యులై నజితేంద్రియగురునిఁ
గరమర్థియై పరకాయప్రవేశ
గురుని నిత్యానందగురురాజచంద్రుఁ
డరయ నిరంజనుఁ డనుగురు మదిని
నిరతంబు వేఁడుచు నెమ్మిమై మిగులఁ
గాంచు బోధానందఘనుపదాబ్జంబు
లంచితభక్తిమై నాత్మయందుంచి
కుదురుగ మది నిట్టిగురుపరంపరను
సదమలహృదయనై సన్నుతిచేసి

సర్వయోగీంద్రులు సంతసింపంగ
నుర్వియం దీరాజయోగసారంబు
వఱల నే ద్విపదకావ్యముగ రచించి
యెఱుకయౌ హరి కియ్య నెడఁదఁ దలంచి
మున్నుగ నాచందములు తేటగాఁగ
విన్నవించెద మీకు విశదంబుగాను
వినరయ్య కవులార విద్వాంసులార
వినరయ్య మీరెల్ల విమలాత్ములార
ఘనయతిప్రాససంగతుల నేనెఱుఁగఁ
దనర నాక్షేపింపఁ దల్పకుఁ డెలమి
శ్రీకరుం డగునారసింహునికరుణ
నీకథాప్రారంభ మెసఁ జేసి తలర
మహితాత్ములార ధర్మాసక్తులార
మహిమాఢ్యుఁ డగుకర్దమప్రజాపతికి
ననుకూలవతి యగు నాదేవహూతి.
యనుసత్పతివ్రత కవనీతలాన
ననురాగయుక్తుఁడౌ నమ్మహాపుర్షుఁ
డెనసి పుత్రికల తా నింపుగఁ గాంచి
తనయులు లేక డెందమునఁ జింతించి
యనుపమంబైనఘోరాటవి కరిగి

పరమాత్ముఁ గూర్చి తపం బాచరించె
నరుదుగఁ బరమాత్ముఁ డమ్మహాత్మునకుఁ
బరఁగఁ బ్రత్యక్షమై పల్కె నిమ్మాడ్కి
వరమేమి నీకుఁ గావలె నని యడుగ
విని కర్దముఁడు చాల వేడ్కఁ బ్రార్థించి
యనియెఁ గృపాంబుధి యంబుజనయన
పరమాత్మ నీవు నాపట్టి గావలయు
వరమిదె చాలు నేవర మొల్ల నింక

ననవుఁడు పరమాత్ముఁ డావరమిచ్చి
తనరార నంత నంతర్ధానుఁ డయ్యె
నావేళ కర్దముఁ డరిగి మోదముగ
దేవహూతిం గూడెఁ దిరముగ నంత
వెన్నుండు పరికించి వేడ్కతో వచ్చి
యున్నతుఁడై దేవహూతిగర్భమున
గరిమమై జనియించెఁ గపిలుఁ డనంగఁ
గరమర్థిఁ బెంపొంది ఘనుఁ డయ్యె నంతఁ
బూని కొన్నాళ్లకు బుణ్యచారిత్రుఁ
డైనకర్దముఁడు నిజాత్మజుం జూచి
నావరపుత్రక నావంశతిలక
నీవు నాసుతుఁడవై నిజముగ నన్నుఁ

జెన్నలరంగఁ బ్రసిద్ధిచేసితివి
అన్న నాకోరిక లన్ని ఫలించె
న్యాయంబుఁ దప్పక యానందముగను
బోయెద నింకఁ దపోవనంబునకు
ననుచు సమ్మతిఁ జేసి యాక్షణంబునన
తనవధూమణికిఁ దాఁ దద్వివరంబు
నలరారఁ దెల్పిన నాదేవహూతి
పొలుపొందఁ బతిపదంబులయందు వ్రాలి
పూని యిట్లనియెఁ దాఁ బుణ్యాత్మ యేను
మానసంబునుబట్టి మఱియొంటి నుండఁ
జాల నే నీవెంటఁ జనుదెంతు ననిన
నాలలితాంగికి నతఁ డిట్టులనియె
భామ నీ వీరీతిఁ బలుక నేమిటికిఁ
బ్రేమ నాయందున్నఁ బెక్కుధనంబు
నీకుమారుడు ధర్మనిపుణుండు గాన
నీకు జీవన్ముక్తి నిజముగ నొసఁగు
వనమున కీవు రావలసిన దేల
వనిత యిచ్చటన నీవ్రతము ఫలించు
నని యొప్పఁజెప్పి యాయతివను సుతుని
నొనరంగ వీడ్కొల్పి యుచితమార్గమున

వరతపోధనదసద్వనమందుఁ జేరి
పరమేశు నెద నుంచి ప్రార్థించుచుండె
నెమ్మి నాకపిలుఁడ నేకవత్సరము
లిమ్ముగ జనకుని యెస నాజ్ఞనుండి
పాయనిసంసారపథ మాత్మఁదలఁగ
మాయావిరహితుఁడై మౌనియై యంతఁ
గాననంబున కేఁగఁ గా దేవహూతి

యానందనుంజూచి యనియె నిమ్మాడ్కి
వరపుత్త్ర నీతండ్రివాక్యంబు నేఁడు
సరవి మఱచితె నీస్వాంతమునందు
నానాఁడు నీతండ్రి యరిగెడువేళ
నేను శోకింపఁగ నినుజూపి వగపు
నణఁచి కానకు నేఁగె నమ్మహామహుఁడు
గుణరత్న నిన్నుఁ గన్గొనుచు నేచింత
నెఱుఁగక యుండితి నిన్నాళ్లుదనుక
మఱి నీ వదియు నొగి మది నెంచకుండ
జనకాజ్ఞ వదలి విచ్చలవిడిగాను
నను విడనాడి కానకు నేఁగఁ దగునె
తల్లితండ్రులు పరదైవంబు లంచు
నెల్లవా రనుచుండ నెఱుఁగవే నీవు
నీమదిలో నుండునీతి భావించి
యేమున్నమాటాడుమెల్ల నిల్కడగ
అన విని కపిలాఖ్యుఁ డల్లన నవ్వి
తనతల్లి నీక్షించి తా నిట్టు లనియె

తల్లికిఁ గపిలుఁడు విరక్తిమార్గము బోధించుట

ఏలకో జనని నీ కీపామరంబు
చాలించు నిది వట్టిజాలి జగాన
తలిదండ్రు లెవ్వారు తనయు లెవ్వారు
దెలియ బుద్బుదము లీదేహంబు లెపుడు
కాయ మస్థిర మని కడఁ గాన లేక
పాయక సంసారబద్ధులైమమత
వదలక కామ్యార్థవాంఛితు లగుచు
మదమత్తు లగుచు దుర్మార్గంబునొంది
మదిలోన నుబ్బి కామక్రోధలోభ
మదమోహమచ్చరా ల్మాటికిఁ బెంచి
సంపద గల్గితే సామర్థ్య మంచు
సొంపగు తుచ్ఛమౌ సుఖమును గోరి
కామాంధు లై తమగతి గానలేక
భామలవలలోనఁ బడి లేవలేక
తఱగనియీషణత్రయవార్ధిలోన
మఱిమఱి మునుఁగుచు మమత రెట్టింప
నాలుబిడ్డల కనియర్థంబు గూర్చి
కాలంబు నూరక గడుపుచు నుండి

యంతకాలము వచ్చినప్పుడు యముని
చింతఁ జేయుచు హింసచేఁ గంది గుంది
కూపంబు లోఁబడి కొన్నాళ్లు కఠిన
పాపాత్ము లగుచుం బ్రపంచంబునందుఁ
బుట్టుచు గిట్టుచుఁ బొరలుచుండెదరు
ఇట్టిపుట్టులు చావు లెన్నంగ వశమ
యన దేవహూతి నిజాత్మజుంజూచి
యనియెఁ గుమార! యీయవనీతలానఁ
బట్టుగ నిరతంబు బహురూపపటిమె
నిట్టిపిండోత్పత్తి యెట్లగు ననిన
విని కపిలుండు సద్వినయంబు మెఱయ
జననితో నిట్లనె సంతసంపడఁగ.

పిండోత్పత్తిలక్షణము

విను మింక దల్లి తద్వృత్తాంత మీవు
తనరంగ నన్నమదంబును మించి
సతిపతు లిద్దఱు సంతసం బలర
రతి సల్పఁగా ననురాగంబు మించి
నెలవుగ శుక్ల శోణితములు రెండు
కలసి యేకంబుగ గర్భమందుండి 80

నెఱి నది యైదింట నీటిబుగ్గౌను
పఱిదగ గట్టియౌ బదిదినంబులకు
నమరి పదేనింట నండమైయుండు
స్థిమితమై నెలనింట శిరమేరుపడును
బరగ నెలల్ రెంటఁ బదకరంబులును
సరవిగ నేర్పడు చందము దెలియ
నొనర నెలల్ మూఁట కుదరంబు గల్గు
ననబోడి నాల్గింట నడుము పార్శ్వంబు
లొందును బాదంబు లొందు నాపైని
బొందుగ నాఱింటఁ బుట్టు నేత్రములు
సరవి నేడవనెల సరగ జీవుండు
పరఁగఁ బ్రవేశించుఁ బాయక యంద
మఱియు నష్టమమాస మహితతేజమును
బఱిదగ విజ్ఞానపరధనం బలరి
లలి ధాత్రిఁ బ్రసవకాలంబునువఱకు
మలమూత్రములఁ జిక్కి మఱి యాత్మఁ గుంది
కటకటా! నాపూర్వకర్మంబువలనఁ
బటుతరపాపకూపంబునం బడితి

పూర్వజన్మంబున బుద్ధిలేకుండ
గర్వించి సత్క్రియల్ గాంచకపోతి

సద్గురు నాశ్రయించంగఁ బోనైతి
సద్గతి నేను విచారింపనైతిఁ
బామరంబునఁ బడి పరభామినులను
గామించి యవివేకకలితుఁడనైతి
బాలబుద్ధులు చేతఁ బాతకం బనక
చాలఁ బెద్దలను దూషణము చేసితిని
తనువు లస్థిరములు ద్రవ్య మస్థిరము
లని యించుకేనియు నారయనైతిఁ
బెనుప్రేమ పెండ్లము బిడ్డలఁజూచి
మనమున హర్షించి మత్తుఁడనైతి
గాన నీవిధ మగుకష్టకూపాన
నేను జిక్కితి నింక నెవ్వరు దిక్కు
ఈమూత్రమలకూప మే నింకఁ గడచి
భూమిపై వ్రాలిన బుద్ధి తెచ్చుకుని
పరమదేశికపదాబ్జంబుల వేఁడి
పరమైన నిర్వాణపదము నొందెదను
మఱచియుండను దొంటి మాయలోఁ బడను
మఱి యిప్పు డీమూత్రమలకూప మేను
ఎప్పుడు దాఁటెద నని యెంచుచుండ
నప్పుడు తొమ్మిది యగునెలల్ మించ

ధరణిపైఁ బడఁగ నంతట విష్ణుమాయ
తఱచుగఁ గప్పినఁ దల్లడిల్లుచును
ఆవేళ శిశువయి యన్నియు మఱచి
కావున యేడ్చి యక్కడకుఁ దన్ మఱచి
మునుపటిజ్ఞానంబు మోసయై మంచ
మునఁ బడి తనమలమూత్రాదులందుఁ
బొరలుచు దుర్బలంబున నుండఁగాను
గురుతుగ నట గాలి గుంతయుఁ ద్రవ్వి
కిసరులు కూనలు కిన్కసందులను
ముసరులు దగ్గులు ముట్టుదోషములు
ననుభవించుచు వృద్ధి యై వయోధర్మ
మును మించి వచ్చినప్పుడు మత్తుఁ డగుచు
వసుధఁ బెండిలియాడి వరసుతసుతుల
నెసఁ గాంచి వారల నెలమిఁ బోషింప
భూవరులను వేఁడి పొల్పుగ ధనము
నేవగనైనఁ దా నెసఁ గూర్చి మించి
భూరిలోభము దారపుత్త్రాదుల నొగి

వారక గాచుచు వసుధఁ గట్టకడ
కడు వృద్ధదశ రాగఁ గాయంబువడఁక
దడవుచు మంచాన దగఁ జేరి యుండి

చెవుడు వట్టి మఱేమి చేయుటలేక
యెవరు వచ్చినఁగాని యెఱుఁగకయుండి
ఆలుబిడ్డలఁ జూచి యకట నే వీండ్రఁ
బాలించువిధమును బరికింపనైతి
నని ప్రలాపించుచు నంతకాలమున
మొనసి వచ్చినయమముఖ్యసేవకులఁ
గనుఁగొని యఱచుచుఁ గనుల మూయంగ
వెనువెంట గొంపోయి విభునిడగ్గఱగ
నిలువఁజేయఁగఁ జూచి నెఱిఁ బాపములను
దెలియంగ నాశ్రాద్ధదేవుండు వడిగ
నడుగ లెక్కలు చూచి యాచిత్రగుప్తుఁ
డెలమిఁ జెప్పఁగ వెంట హింసచేయుఁ డన
భటు లట్లసేతు రెప్పటివలెఁ బుడమి
నటఁ బుట్టవలయుఁ బాయక బంధుమిత్రు
లంతకాలంబున నయ్యయో యంచుఁ
జింతించుచుందురు చేరి డగ్గఱగఁ
గావున జీవుని కఠినమార్గంబు
కానంగలేరు టక్కరిమాయవలన
తనువులఁ దామని దలఁచుచుండుదురు
తనువులోపల కర్మతతి విచారింప

నెత్తురుప్రేవులు నిండుమాంసంబు
హత్తినయెముకలు నధికమౌ చీము
మొనసినచర్మంబు మూత్రంబు మలము
నెనసి దేహములోన నెసఁగుచు నుండు
నటువంటిఘటములం దాకాంక్షఁ జేసి
కుటిలులై తమలోన గుఱిఁ గానలేరు
అన విని యాయింతి యాత్మజుం జూచి
యనియె నోతనయ మాయాప్రపంచంబు
నెవ్వరు గల్పించి రెఱిఁగింపు మనిన
నవ్వారిజాక్షికి నతఁ డిట్టులనియె.

విశ్వోత్పత్తిఘట్టము

విలసితమైన యీవిశ్వమంతయును
గలిగినచందము గ్రమముగ వినుము

నిత్యుండు నచలుండు నిర్వికారుండు
సత్యుండు సగుణుండు సర్వాత్మకుండు
ననెడుపరబ్రహ్మ యాదికాలమున
ఘనతరమై నిరాకారమై యుండె
నతనియందు ననాది యైనట్టిమాయ
యతఁడు గూడి వహించె నయ్యాశుసంజ్ఞ
నెలమి నచ్చటఁ గల్గె హేమగర్భుండు
కలకంఠి యాహేమగర్భునియందుఁ
దలఁగక యట మహాతత్వంబు పుట్టె
నలరంగఁ గలిగె నహంకారమందు
నది మూఁడుభాగంబు లై వృద్ధిఁ బొందె
ముదిత సత్వరజస్తమోభేదములను
బొందె సత్వమున నింపుగ జ్ఞాన మరయఁ
బొందుగ రాజసంబున నుద్భవించె
నలరార కర్మేంద్రియములు తామసము
వలనఁ దన్మాత్రంబు వరుసగఁ గల్గె
నందు శబ్దంబున నభ్రంబు వొడమె
నందు సదాశివుఁ డధినాథుఁ డయ్యె
మఱియును స్పర్శతన్మాత్రంబువలనఁ
గఱువలి గలిగె నక్కడ నీశ్వరుండు
నలరార నచ్చటి కధికారి యయ్యెఁ
దలకొని యట రూపతన్మాత్రవలన
నొనర హుతాశనుఁ డుద్భవుం డయ్యె
ననిశంబు నిట్టిహుతాశనాకృతికిఁ
బరగ రుద్రుం డధిపతి యయ్యె నవల
సరవిని రసమున జల ముద్భవించె
హరి నాయకుం డయ్యె నమ్మరో వినుము
మఱియును గంధతన్మాత్రంబువలన
సముదయం బయ్యె విశ్వంభరయందుఁ
గమలసంభవుఁ డధికర్తయై నిల్చెఁ
బ్రకటితమైన యీపంచభూతముల
నొకటొక్కటిని రెండు నొనర భాగించి
యందందు నొక్కనిజాంశంబు నుంచి
యందందుఁ దక్కినయట్టియం దొకటి
కలకంఠి నాల్గేసిగా విభాగించి
కలయఁ బంచిననవి క్రమముగఁ బుడమిఁ
బంచీకృతం బయ్యెఁ బరికింపఁ దల్లి
యంచితంబుగ విను మది యెట్టులనినఁ
బొందుగ నాకాశమున నర్ధమయ్యె

నందు జ్ఞాతృత్వము నం దొగి నాల్గు
నగుభాగములఁ బవనాగ్నిజలముల
నొగిఁ గూడి మానసం బొగి బుద్ధి చిత్త
మును నహంకారంబు మొనసి వాతూల
మున నర్ధభాగంబు పుణ్యాచరిత్ర
అరయ వ్యానం బయ్యె నటు నిల్చెనాల్గు
నిరవుగ భూమి వహ్ని జలంబు గగన
ములఁ గూడి యింతకు మూలంబు నగుచు
నల పంచభూతంబు లయ్యె నెంచఁగను

తల్లి హుతాశనార్ధము చక్షువయ్యె
నెల్లఁ దక్కిననాలు గెంచ భూనీర
మరుదంబరముల మర్మంబుగఁ గూడి
యరయఁ ద్వక్ఛ్రోత్రజిహ్వాఘ్రాణములను
గలిగె నీ రర్ధభాగము రసంబయ్యె
నలినాక్షి తక్కిననాల్గు భూవహ్ని
మారుతాంబరముల మఱి గూడి వరుస
నారూప మాశబ్ద మాస్పరిశంబు
తనరార నోజ గంధంబయ్యె నట్ల
మొనసి యాభూమ్యార్ధమున పాయువయ్యెఁ
తల్లిరో విను మొగిఁ దక్కిననాల్గు
నల్ల ధనంజయ యనిలాంబరముల
సారంబులై కూడి సల్పుక్రియలకు
నారూఢిహేతువు లైనట్టిగుహ్యా
హస్తవాక్పాదంబు లనువుగఁ గల్గి
విస్తరిల్లెను బంచవింశతిక్రమము

పంచవింశతితత్వప్రకరణము

వీనుల కింపుగ విను మొకపథము
పూని జెప్పెదఁ బంచభూతంబులకును
బలము సద్యోజాత వామదేవులును
బొలఁతి యఘోరతత్పురుషు లీశానుఁ
డనెడు పంచబ్రహ్మ లా బ్రహ్మ విష్ణుఁ
డును రుద్రుఁ డీశ్వరుఁ డొగి సదాశివుఁడు
పంచకర్త లనంగఁ బ్రఖ్యాతులైరి
యంచితమౌ మానసాదులు నైదు
రాణింపఁగాను బరాశక్తి యయ్యెఁ
బ్రాణాదివాయువు ల్పుట్టుగఁ జూడ
నాదిశక్తి యనంగ నమరె శ్రోత్రేంద్రి

యాదులు నైదయ్యె నలర విజ్ఞాన
మరయ నీభూమ్యాదు లైదుతత్త్వములు
సరవిగ నెంచ నిచ్ఛాశక్తి యయ్యెఁ
గ్రమముగ వాగాదికర్మేంద్రియములు
నమరఁ క్రియాశక్తి యయ్యె నోతల్లి
అన్నియుఁ గూడి బ్రహ్మాండమై నిలిచె
నెన్నఁగ శ్రీజగదీశుఁడౌ శ్రీవి
రాజితుండును శ్రీవిరాట్పుర్షరూప
మాజగదాకృతి కరయఁ బెంపారె
పాతాళలోకంబు పదమయ్యె నట్లు
ఖ్యాతిగ సత్యలోకంబు శీర్షంబు
లోకము లెల్ల నాలోకింప నాదు
శ్రీకరతన్వు లై చెలఁగునోతల్లి

అనువొంద నిట్టిమహావిగ్రహునకుఁ
గొనకొని యన్నిదిక్కులు శ్రోత్ర మరయ
నొనరంగ వినుము వాయువు త్వగింద్రియము
మొనయునేత్రేంద్రియ మొప్ప భానుండు
పరగ భ్రూయుగ్మంబు బ్రహ్మపదంబు
చిరతరవరుణుండు జిహ్వేంద్రియంబు
వెలియ నాశికము నశ్విని దేవతలును
వలనొప్ప వహ్నిగ వాగింద్రియంబు.
తెలియ బాహువు లెల్ల దేవతాధిపుడు
తలఁగకుండును భాగతత్వంబు లరయఁ
బరగ నుపేంద్రుండు పాదేంద్రియంబు
పరికింపఁగాఁ బ్రజాపతియు గుహ్యంబు
వలనొప్ప మృత్యుదేవత యగునంబు
కలువపువ్వుల చెలికాఁడు మనంబు
మతి బ్రహ్మదేండు మహనీయచిత్త
మతులితక్షేత్రజ్ఞుఁ డనఁబడుచుండు
ననుపమాహంకారుఁ డగురుద్రమూర్తి
తనర జ్ఞాతృత్వ మంతఃకరణంబు
సరవిగ జీవునిచంద మీమీఁదఁ
బరగ జెప్పెద విను బ్రాకటంబుగను

అలరు ఘటాకాశ మం దొప్పుగాను
గలిగినజలములోఁ గన్పట్టు నభము
గతి సాక్షియం దున్న గ్రాలెడుబుద్ధి
ప్రతిబింబితం బైనబ్రహ్మ మీరీతి
జీవుఁడ ననుభ్రాంతి చేఁ జిక్కి మించి
సావధానక్రియాశక్తినిఁ గూడి

రూఢియై తనస్వస్వరూపంబు మఱచి
మూఢుఁడై షడ్వర్గములకు లోబడుచుఁ
దులువయై మానసాదులచేతఁ జిక్కి,
కలుషాత్ముఁ డై తన్ను గానక భ్రమసి
భిన్నభావములచేఁ బెక్కుదేహములు
పన్నుగ ధరియించి పరవశత్వమున
స్త్రీలు పుర్షు లటంచుఁ జెడుగుభేదముల
వాలాయముగఁ జిక్కి వాంఛతోఁ దగిలి
వారును వీరును వారు మే మనుచు
భారంబుగను నహంభావ మూహించి
జీవభ్రమములచేఁ జెడి పలుమాఱు
చావు పుట్టువు గల్గి జడుఁ డాయె నిప్పు
డెప్పు డైనను జీవుఁ డిదియెల్ల విడచి
యొప్పుగ విజ్ఞానయుక్తినిఁ గూడి

తన్ను దాఁ దెలిసిన ధన్యునిఁ జేరి
పన్నుగ నతనిచే బ్రహ్మంబు దెలిసి
కామాదిశత్రుల ఖండించివైచి
యామూక సకలేంద్రియాల జయించి
నిటలభాగంబున నిలిచి శోధించి
ఘటము బయల్జేసి కడఁగాంచె నేని
యతఁడ పరబ్రహ్మ మతఁడ స్వయంభు
వతఁడ మహావిష్ణు వతఁడ శివుండు
అతనికి వేఱలే దనుచు బోధింప
నతని కి ట్లనివల్కె నా దేవహూతి
మలమూత్రరక్త దుర్మాంసంబు చీము
గలిగిన దుర్గంధకాయంబులందు
నిరవుగ నాబ్రహ్మ మేరీతి నుండు
పరవి నా కెఱిఁగింపు సదయాత్మ యనఁగఁ
గపిలుఁ డాతల్లిని గరిమనుఁ జూచి
యపు డిట్లు వచియించె నమ్మరో వినుము
ఇది సోమనాథ విశ్వేశుని పేర
పదవాక్య భవ్యసుబ్రహ్మణ్యయోగి
చరణాంబుజాతషట్చరణాయమాన
పరిపూర్ణ నిత్యసద్భావనిమగ్న
మానస యగువేంకమాంబికారచిత
మైనట్టి రాజయోగామృతసార
మం దెన్నఁగాఁ బ్రథమాఖ్యప్రకరణ
మొందు శ్రీ తఱికుండ పురిధాముఁ డైన

వీరనృసింహుఁడు వెలయఁ గైకొనియె
ధారుణి నాచంద్రతారార్కముగను.

ప్రథమ ప్రకరణము సంపూర్ణము.

శ్రీ ర స్తు

రాజయోగసారము

ద్వితీయ ప్రకరణము

శ్రీకరానందవశీకరం బైన
ప్రాకటభక్తిమై భావ మంతయును
వినుము నీ వత్యంతవేడ్క నోతల్లి
కనఁగ సుగంధదుర్గంధముల్ రెండు
ననుపమపరమాత్ముఁ డంటి రెంటికిని
దనరారఁగాను మేధ్యామేధ్యములను
బ్రతిఫలింపదె భాను భాసురకిరణ
గతిగ సంవ్యాప్తంబుగాఁ దనరార
నతనికి నేమంటె నర్కునిభాతి
అతులితంబుగ నాత్మ కంట దేమియును
మతిమంతులకు నట్లు మలినంబు లేదు
క్షితి నీవిధంబును జెలఁగి చూడంగఁ
గుటిలత్వరహిత మెక్కువగాఁగ నిట్టి
ఘటములోనివిధంబు గ్రమముగ వినుము
సలలితపంచవింశతితత్వములను
బొలుపొందు స్థూలాఖ్య పుణ్యాచరిత్ర
కాయంబులో సప్తకమలంబు లుండుఁ
బాయక వానిని బరఁగఁ జెప్పెదను
దొలుత నాధారమ న్దోయజాతంబు
సలలితమౌ రహస్యస్థానమందు
గొనకొని నాల్గురేకులపీతవర్ణ
మును వశషసలను ముఖ్యాక్షరములు
ననువుగ భూముద్ర నమరుచు నుండు
నెనసి యచ్చటను గంగేశ్వరుఁ డుండు
నలరఁగ విను దాని కావలివిధము
దలకొని యంగుళద్వయముమీఁదటను
ధీరత మీర స్వాధిష్ఠానజలజ
నాఱురేకులతోడ నమరు శ్వేతముగ
నది బభమయరలా యనువర్ణములను

అది పక్షిముద్రయం చనఁ దగి మఱియు
జలజాతభవుఁడు నిశ్చలత నుండు నొగి
నలఘుప్రకాశుఁ డై యమ్మరో వినుము
మొనసి యష్టాంగుళములమీఁదఁ దనరి
యనువుగ మణిపూరకాఖ్యంబు వెలుగు
నెఱి ఱేకులును బది నీలవర్ణంబు
వఱల డాదిఫకారవర్ణము ల్గల్గి
యనువర్ణము ల్గల్గి యాపీతముద్ర
యొనరంగ వెన్నుఁ డం దొప్పుచు నుండు
పదియంగుళములకుఁ బైన నాహతము
హృదయప్రదేశమందిరముగ నుండు

భామవి ద్ద్వాదశపత్రము ల్గలిగి
హేమవర్ణంబున నింపొందు నందు
నఖిలవాక్యావళి కాస్పదం బగుచు
కఖగఘజలు చఛాఖ్యలు జఝఞణలును
ననువొందఁగా టఠా యనులింగముద్ర
దనరారు రుద్రుఁ డాస్థానాధిపతియు
నావల మఱి ద్వాదశాంగుళములను
ధావళ్యరుచి విశుద్ధంబు పదాఱు
దళములై, అఆలు దానికి వర్ణ
ములు నగునది మత్స్యముద్ర జీవుండు
అందుండు మఱి ద్వాదశాంగుళములను
బొందుగ భ్రూమధ్యమున దళద్వయము
అందుఁ బావకదీప్తి యలరుచు నుండు
నందు హంసలు రెండు నమరుచు నుండు
ధరణిఁ బ్రకాశముద్ర యనంగ నదియ
పరమాత్ముఁ డచ్చట ప్రభువై వెలుంగు
నందుకు నవల సహస్రారమందుఁ
గ్రందుగ నుండు హకారసకార
బీజద్వయం బాత్మబిందువుఁ గూడి
తేజరిల్లుచు నుండు దేదీప్యముగను

గగనముద్రయు నదె గన్గొనఁ దల్లి
సగుణనిర్గుణరూప సచ్చిదానంద
గురురాజచంద్రుఁడు కొల్వారుచుండు
సరవి నన్నిటికిఁ దా సాక్షియై యుండు
పనివడి విను మంబ ప్రాణానిలంబు
మొనసి యాహృత్పద్మమున నిల్చియుండు
తఱుచైనపవనుఁ డాధారచక్రమున
విరివిగ నేవేళ విహరింపుచుండు

అలసమానుఁడు నాభియందు నవ్యానుఁ
డలరి సర్వాంగంబులందుఁ దానుండు
గళమున రోమసంఘంబులయందుఁ
దొలఁగక నాగ వాతూలంబు మఱియు
ననఘ లలాటమం దాకూర్మపవనుఁ
డనువొంద ఘ్రాణమం దాకుకురుండు
కంటిపై నుండును ఘనదేవదత్తు
డంట నారంధ్రమం దాధనంజయుడు
అనుదశవాయువు లంగములందు
మొనసి తత్తత్కార్యములు సల్పుచుండు
లలిని యిళాపింగళలు సుషున్నయును
నలరార నాధారమందుండి వచ్చి

మొనసి యాజ్ఞాచక్రమున మూఁడుఁ గూడి
యనువొందఁగా మఱి యంతట నిలుచుఁ
దనర సుషుమ్న మంతట నిల్వ కరిగిఁ
ఘనతగఁ గ్రమముగఁ గ్రాలుచు నుండి
సరవిగ ఘనసహస్రారంబు సేరి
గురుతరంబుగ నందు గోప్యమై యుండు
దేహమధ్యంబునఁ దిరుగు జీవుండు
సోహం బటంచు సంశోభితంబుగను
మొనసి యహోరాత్రములను జపంబు
నొనరంగ నిరువదియొక్కవెయ్యారు
నూఱును జేసి యనూనంబు గాఁగ
నాఱు నూ ఱాదిగణాధీశునకును
ఆఱువే లాబ్రహ్మ కాఱ్వేలు హరికి
నాఱువే లారుద్రుఁ డనుదైవమునకు
వేయి సదాశివ విభవమూర్తికిని
వేయి యయ్యాత్మకు వేయి గుర్వుకును
వాసిగ దినమును వరుస నర్పణము
చేసినఁగాని యాజీవుండు మగుడి
భాసురమతి నిట్టిభావంబుగాను
శ్రీసద్గురునిమేటిరీతి నీలాగు

కాశిగయాప్రయాగలు నంద యుండు
దేశికుఁ డటుమహాదేవుఁ డై యుండు
పోఁడిమి మీరఁ బెంపొందుచు మధ్య
నాడి సహస్రారనాళమై యుండు
నదియ సరస్వతి యదె పరంజ్యోతి
యదా యూర్ధ్వకుండలి యదె సుధాధార
యదె భూతతతిహేతు వదె తటిద్వల్లి

యదె చిద్విలాసంబు నదె పరమంబు
ఇటువంటిసుధ దేహి కెస నంటనీక
కుటిలమార్గత నధఃకుండలి పొంచి
పటుశక్తి నమృతంబు పానంబు చేయ
నిటువంటికీలకం బెఱుఁగక దేహి
కాయమే నని యహంకారి యై యాత్మ
నాయకుఁ గనలేక నానావిధాల
ముక్తినొందెద నని ముందు గానకయ
శక్తిచేఁ గర్మముల్ సల్పుచు నెపుడు
కాశికిఁ బోయి చక్కగ గంగలోన
నాశగ మునిఁగినయప్పుడ తనకు
నంటువోవునె మోహ మబ్బునె తల్లి
తొంటిపాపము వోయి దొరకునె సుఖము.

జీవన్ముక్తివిచారఘట్టము

అని యిటువల్కిన నాదేవహూతి
తనసుతు నీక్షించి తగ నిట్టు లనియె
పావనచరిత జీవన్ముక్తి నరుని
కేవిధంబునఁ గల్గు నెఱిఁగింపు మనిన
జనయిత్రిఁ జూచి యాసత్కుమారుండు
మనమున హర్షించి మాత కిట్లనియె
వినవమ్మ జనని యీవిశ్వంబునందు
మనుజులు వేఱ కర్మంబులు విడచి
తను దాను దెలిసినధన్యునిఁ జేరి
పనివడి ద్వాదశాబ్దములు శుశ్రూషఁ
జేసి మెప్పింపఁగ శ్రీగురుమూర్తి
భాసురంబుగ వారిభక్తికి మెచ్చి
యసదృశసిద్ధాసనాసీనుఁ జేసి
భసితంబు తమఫాలభాగాల నుంచి
వారితత్పూర్వపువ్రాలెల్లఁ దీసి
భూరికృపవ్రాలు పొందుగ వ్రాసి
జడియకుఁ డని వారిజడుపెల్లఁ దీర్చి
కడువేడ్క రాజయోగప్రకారంబు
సాంగముగను జెప్పి సాధుపథంబు
శృంగాటకంబునఁ జేరి చూడుఁడని

గురుమూర్తి యపుడు మక్కువ మీఱ శిష్యుఁ
డరుదుగఁ దసమానసాబ్జమం దుంచి
పరమార్థసరణి సద్భావంబు మీరఁ

బరమాద్భుతధ్యానపరవశత్వమున
మనసు సహస్రారమధ్యమం దుంచి
మొనసి తా నపుడు షణ్ముఖి యనుముద్ర
వితరణంబుల లేదు విద్యల లేదు
వ్రతములలో లేదు క్రతువుల లేదు
మతములలో లేదు మహిమలో లేదు
సతతంబు నన్నియు సల్పువారలకు
నలరంగ దివ్యస్వర్గాదిభోగములు
గలిగి యాపుణ్యముల్ కడ ముట్టఁగాను
సమసినప్పుడ చాల జన్మంబు లెత్తి
శ్రమములు వడుచుండు సరవిగ నెపుడు
గనుక స్వర్గాదిభోగము లిచ్ఛయింప
కను మనశ్శుద్ధి చక్కఁగఁ జేసి పరము
సద్గతిగాను విచారించి యపుడు
సద్గురుచే వేదసారంబు దెలిసి
మమతను విడి కూటమార్గంబు చేరి
అమలసాంఖ్యము తారకామనస్కములఁ

గలిగిన యనుభవక్రమములం దెలిసి
సలలిత శివయోగసచ్చిదానంద
వైరాగ్యసుఖకేళివార్ధిలో మునిఁగి
వైరాగ్యసంపద వఱలుచుండంగ
నవధూతభావుఁడై యాత్మను జెంది
ప్రవిమలజ్ఞానంబు ప్రబలుచుండంగఁ
దానను నహమును దగ్ధంబు చేసి
తానను దానై యుండు తత్త్వంబు దెలిసి
నిగమాంతవేత్తయై నిలిచినవాఁడు
మగు డిందురాఁడు జన్మము నెత్తఁబోఁడు
మఱికొంద ఱీమహామహిమఁ గానకయు
గురు నెఱుంగక కర్మగురుచెంతఁ జేరి
గాథకుఁ జిక్కి దుష్కర్మమార్గమున
సాధనంబుగ యోగసరణులఁ దెలిసి
యలమట నాసనాభ్యాసము ల్చేసి
చలమున బాహ్యాలక్ష్యములు చూపుచును 110

కూలంకషములోనిగుఱిఁ గానలేక
లాలితంబుగ మంత్రలయహఠయోగ
ఫలములం గోరుచుం బామరు లగుచు
జలబుద్బుదమువంటి జన్మంబులకును
సిద్ధులం గోరి ప్రసిద్ధమై యోగ
సిద్ధాంతమందు సుస్థిరమతి లేక

అగణితవిషయసుఖాసక్తిమిరఁ
దగ మణిమంత్రసిద్ధక్రియల్ నేర్చి
మఱి పామరులకెల్ల మహిమలం జూపి
తిరిగెడువార లీ దేహవాసనలు
వీడఁగ నేరరు వేదాంతమందుఁ
గూడ నేరరు వట్టికుంభనగాని
వరముక్తిఁ బొందెడువాఁడు త్రికూట
మరయఁగ నిష్ఠమైనందునఁ జెంది
నెలవుగ నౌ త్రివేణీసంగమమున
జలకంబు లాడి విశ్రాంతివహించి
వెలిప్రపంచంబును విడిచి యాలోన
నిలిచి చూచెడితెల్వి నే నని నిజము
నరసిన బ్రహ్మవిద్యాధురంధరులు
దొరఁకొని కాయసిద్ధులు గోరఁబోరు

నూరక సంసారయుక్తులై యుండి
ధారాళముగఁ దమ్ముఁ దాము చూచుకొని
జలజపత్రంబులో జలముచందాన
నలరి సంసారమునం దంట కెప్పు
డుండుధన్యులు సిద్ధయోగులు గాక
ఖండవిద్యలు నేర్చి గర్వంబు మించి
స్తంభనమోహనోచ్చాటనమంత్ర
జృంభణంబులు సూపి చెలఁగెడువారు
పవనయోగము నేర్చి పటుయుక్తిఁ బెంచి
యవిరళంబుగఁ దటాకాంతరమందు
మహిమఁ జూపుటకుఁ బద్మాసనంబునను
సహజంబుగా నుండి జనుల మెప్పించి
బద్ధులై యంతకుఁ బరమైన యోగ
సిద్ధాంత మెఱుఁగక చెడిపోవువారు
కడుపునిండఁగ నుదకంబును బీల్చి
కడుపున మలమెల్లఁ గడగి శోధించి
యిది యాత్మసిద్ధి యౌనని నిశ్చయించి
ముదమంది తమలోన మురిసెడువారు
వాయుధారణసేసి వసుధఁ గొన్నాళ్లు
కాయంబు వేయేండ్లు కాపాడువారు

ఆత్మానుభవులుగ నరసి వీక్షించి
యాత్మను గాంచిన యవధూతమూర్తి
అల నభోమధ్య కుంభాకృతిగాను
వెలిలోను వెల్గుచు విషయశూన్యముగ
జలరాశిగతకలశంబుచందానఁ

బొలుపొంద వెలిలోను పూర్ణమై యుండి
అంతముఁ దాఁ గాక యంతఁ దానగుచు
సంతతానందాబ్ధిచంద్రుఁ డై యున్న
యతఁడె యోగీశ్వరుఁ డతఁడె ధర్మాత్ముఁ
డతఁడె పరాత్పరుం డతఁడె సద్గురుఁడు
ఇటువంటి గురుతత్త్వ మెఱుఁగక నీవు
మటుమాయగాఁ జిక్కి మై నీడవలెను
తనవారు పెఱవారు తగుపాటిబంధు
లనియెడుభ్రమలు సత్యంబుగ నమ్మి
ననుఁజూచి నీవు కానకు నేఁగఁదగునె?
యని పల్కితివి మాయ ననుసరణగను,
భాసురమతి నిట్టి భావంబు విడచు
నీసుతుఁడనుగాను నెఱివినుతల్లి
నానాఁడు కర్దముం డత్యుగ్రతపము
పూనిచేయుటఁజేసి పుత్రుఁడ నైతిఁ

గాన నే నీసొమ్ము గాను నిక్కముగ
మానసంబును నిది మఱచిపో తల్లి
సుతుఁ డని నన్నికఁ జూడకు మమ్మ
అతలాదిలోకంబు లన్నియు నేను
పంచభూతము లేను బ్రణవంబు నేను
బంచకోశం బేను బరతత్త్వ మేను
గణుతింప సోమ భాస్కర వహ్ని లేను
అణువు మహత్తు లే నఖిలంబు లేను
సగుణభావంబున సర్వమందుండి
యగణితవిభవంబు లనుభవించుచును
పరమైన నిర్గుణభావంబు నొంది
సరవి నంతటికిని సాక్షి నై యుందు
జనయిత్రి నాయంద జగములు నుండు
మొనసి నానాలోకముల నుందు నేను
అలదర్పణంబులో నాననాబ్జంబు
చెలువొందఁ బ్రతిఫలించినచందమునేను
నాయందు జగములు నానావిధముల
మాయగ నీరీతి మలయుచు నుండు
నటుగాన ముకురమందా ప్రతిబింబ
మెటువలె దబ్బరో యెఱిఁగి చూచినను

నటువలె నాయందు నఖిలలోకములు
మటుమాయగా నుండు మైనీడవోలె
నగణితమైన విశ్వాకృతి యగుచుఁ
దగిలియుం దగలక తనరెడువాఁడఁ

గాని నిక్కంబు చక్కఁగ విచారింప
నేన కర్తయు భోక్త నేన బ్రహ్మంబు
అని స్వస్వరూపంబు నప్పుడు చూపఁ
దనయుఁడు గాఁడని తద్దయు నెంచి
కడుదురాశలు మాని కడుభక్తిఁ బూని
కొడుకు నావేళ సద్గురునిగ నెంచి
పావనచారిత్ర పరమపవిత్ర
నీవంటి ధన్యుండు నీవంటి సుకృతుఁ
డేవిధమున నాకు నెస సుతుఁ డైతి?
దేవ జీవన్ముక్తి దిరముగ నీయు
మింతియ చాలు మఱేమియు నొల్ల
నంతయు విడచితి నయ్య నీ దయను
ఏ నొల్ల భాగ్యంబు నే నొల్ల పదవి
నే నొల్ల సంసార మే నొల్ల నెల్ల
నీలీలఁ దెలియక నే యిన్ని నాళ్లు
కాలంబు నూరక గడపుచు నుంటి

సకలలోకాతీతసత్యమౌ తత్వ
మిఁకనైన నుపదేశ మీవయ్య దేవ
అన విని కపిలుఁ డయ్యంబ కిట్లనియె
జననీ నీ వత్యంతసద్గుణవతివి
కావున నీరీతిగా బ్రహ్మవిద్య
కావలె నంటివి గలుగదా నీకు
నని యిట్లు పల్కి సిద్ధాసనమందు
దనతల్లి నునిచి యత్తఱి లలాటమునఁ
జెలువుగ వీభూతిచేఁ జుక్క పెట్టి
మలినంబుఁ బోఁ ద్రోసి మస్తక మంటి
బోధింపఁ దొడఁగె నాపుణ్యసాధ్వి కొగి
సాధురక్షకుఁడు నిశ్చలత నిట్లనియె
నోయమ్మ నీవింక నొగి నిశ్చలముగ
మాయాప్రపంచంబు మానసమందు
మఱచి నిర్మాయవై మామాట నుండు
మిరవుగఁ బరమార్థ మేర్పఱించెదను
దేవ నీ విప్పుడు దేహంబు గావు
నీ వింద్రియంబులు నిజముగఁ గావు
నీవు స్త్రీయును గావు నీవు నపుంస
భావంబు గావు గొప్పగఁ బుర్షరూప

ధారిణి గావు నిం దలఁప వృక్ష పశు
ధారిణి గావు సత్యంబును వఱల
భావనాతీత సద్బ్రహ్మంబు నీవు

నివ యఖండంబు ని వవ్యయంబు
నీవ ప్రకాశము నీవ బ్రహ్మంబు
భావింప నిను నీవు పరగ నెఱుంగు
కనిపించువస్తు వెక్కడనైన లేదు
అని యిట్లు పల్కిన నాయింతి సుతుని
గనుఁగొని పల్కెఁ జక్కనియుక్తి మెఱయ
విను మని యాతఁడి వెన్నుని కెలమి
నేను బ్రహ్మంబు నై నిర్వికల్పంబు
గా నుండఁగానె యాకరణి నిద్రయును
ఆహారమును గల్గు నట్లుండు టేమి
యోహో విచిత్రమై యున్నది దీని
భావంబు దెల్పు తప్పకు మన్న నతఁడు
దేవహూతికి నిట్లు దెలుపఁగఁ దొడఁగె
ఇది సోమనాథవిశ్వేశుని పేర
పదవాక్యభవ్యసుబ్రహణ్యయోగి
చరణాంబుజాత షట్చరణాయమాన
పరిపూర్ణ నిత్యసద్భావనిమగ్న

మానసయగు వేంకమాంబికారచిత
మైనట్టి రాజయోగామృతసార
మం దెన్నఁగా ద్వితీయప్రకరణము
పొందుగఁ దఱికుండపురిధాముఁ డైన
వీరనృసింహుండు వేడ్క గైకొనియె
ధారణి నాచంద్రతారార్కముగను.

ద్వితీయప్రకరణము సంపూర్ణము.

శ్రీ ర స్తు

రాజయోగసారము

తృతీయ ప్రకరణము

శ్రీ రాజయోగసుస్థిరమహామహిమ
సారమై వెలుఁగు ముజ్జగములయందు
హరిణాక్షి నీ విప్పు డడిగినప్రశ్న
సరవిమై విను మది సంతసంబుగను
ఘనతరమోహదుఃఖంబులు రెండు
తనరారఁగా మనోధర్మంబు లరయ
బలము లై తగుక్షుత్పిపాసలు రెండు
నలప్రాణధర్మంబు లనఁబడుచుండు
మర్మంబు విను జన్మమరణము ల్దేహ
ధర్మంబు లనఁబడు తల్లిరో వినుము
ఇదియ షడూర్ములై యెల్లకాలంబు
గదలక యాత్మను గలసినట్లుండు
నాయాత్మ కొక్కటి నంట దూహింప
నాయాత్మ సాన్నిధ్య మందు సంతతము

పంచవింశతి ప్రకరణములు

గగనంబు శ్రోత్రమై గగనసంబంధ
మగుచున్నశబ్దంబు నాలింపుచుండు
అనిలంబు త్వక్కులైయనిలసంబంధ
మనఁదగుస్పర్శ మొయ్యననైనఁ దెలియు
ననలంబు చక్షులై యనిలసంబంధ
మననొప్పు రూపంబు నరుదుగఁ జూచు 10

జలము జిహ్వాయజలసంబంధ మగుచు
విలసిల్లు రసమును వింతగఁ గ్రోలు
జగతియ ఘ్రాణమై జగతిసంబంధ
మగుచున్నగంధంబు నగునిద్ర దనరి
వరుసగఁ బలుకును వాగింద్రియంబు
చరియింపుచుండును జరణేంద్రియంబు

సొరిదిగ నిచ్చి పుచ్చుకొను హస్తములు
సరవిగఁ బాయుపస్థలు రెంటివలన
జలమలంబులను విసర్జించుఁ దల్లి
నిలయంబులై యుండు నెఱీ నెందుకైన
మనసున సంశయ మానుము జనని
తనర నేమైనఁ జిత్తము విచారించు
నన్నియు నేను నే నని యహంకార
మున్నతత్వంబు నుప్పొంగుచు నుండు
నంతఃకరణరూప మగుచు జ్ఞాతృత్వ
మంతటఁ దా నెప్పుడమరుచు నుండు
మొనసి ప్రాణాపానములు సంతతంబు
జనని యుచ్ఛ్వాసనిశ్వాసరూపములు
నలినమిత్రామిత్రనాడులలోన
నలరఁ జరించు సోహం సోహ మంచు

నదియ జపాఖ్య మహామంత్రసంజ్ఞ
యదె జీవపరమున కైక్యంబు దెల్పు
నకుటిల మౌ హృదయంతరస్థలిని
నొకయష్టదళపద్మ మొనరుచు నుండు
నాలోన హంసదీపాకృతి యగుచుఁ
దాలిమి మౌ నష్టదళములమీఁదఁ
గరువలి చలనంబు గల్గినకతనఁ
బరిశోభితంబుగఁ బ్రసరించుచుండు
నొక్కొక్కదళమున నొక్కొక్కచింత
తక్కక గల్గుఁ దద్ధర్మంబులెల్ల
వరుసఁగ దెల్పెద వారక తల్లి
సురరాజదళమున సుకృతంబుచింత
బలువహ్నిదళమున భక్షించుచింత
ఆల యమభాగమందలి పాపచింత
సరవి నైఋతిని దోషము లెన్నుచింత
నెఱి వరుణునిదిశ నిద్రించుచింత
చాలవాయువుదిశ సంచారచింత
యాలోన ధనదుని యలధర్మచింత
వఱల నీశాన్యాన వైరాగ్యచింత
సరవిగ నాజ్యోతి జలజమధ్యమున

బన్నుగనిల్చినఁ బరమార్థచింత
యెన్నెన్నిచందంబు లీశరీరమున
ఖండవృత్తులుగఁ బ్రకాశించుచుండు
దండిగ నీవది దగనేమిగావు
ఆవేళఁ జెప్పినయట్టిచందమున

బావన మగుపరబ్రహ్మంబు నివు
గగన మద్దములోనఁ గన్పట్టుకరణి
నగణితంబుగ బ్రహ్మ మాబుద్ధియందు
బ్రతిఫలింపుచుఁ జిదభ్యాసాఖ్య నమరె
నతఁడు జీవుఁ డనంగ నలరారె వినుము
అలరార నాజీవుఁ డాననాబ్జమున
వెలసి జాగ్రతయందు విఖ్యాతి నమరి
స్థూలాభిమానియై సొంపుగ విషయ
జాలంబులం గ్రీడ సల్పుచు నుండు
తనరఁ గంఠమునందుఁ దైజసాఖ్యమున
ననువుగ సూక్ష్మదేహము నావరించి
యంతరింద్రియముల ననుసరించుకొని
వింతవింతగ స్వప్నవిభవంబు గాంచి
తదనంతరమున రుద్రగ్రంధిఁ జొచ్చి
పదిలంబుగా నందుఁ బ్రజ్ఞాఖ్య నలరి

కారణదేహంబు గైకొని యచట
ధీరుఁడై యంతరింద్రియముల నడఁచి
తెఱఁగార నట సుషుప్తిని జెంది యవల
సురుచిరమైన విష్ణుగ్రంధిఁ జొచ్చి
ఘనమహాకారణాంగంబు ధరించి
యనువుగ నచట తుర్యాఖ్య వహించి
మఱియు నందుండి బ్రహ్మగ్రంధిఁ జొచ్చి
సరవిఁ దుర్యాతీతసంజ్ఞ వహించి
క్రమముగ నాధారకమలంబు చేరి
అమర నచ్చట పరమానంద మేమొ
కరమర్థి క్షణముండి క్రమ్మరం దిరిగి
సరగున సామపంచకమును గూడి
మొనసి యాజ్ఞాచక్రమున నిల్చియుండు
వనజాప్తుఁ డుదయించి వచ్చినజనులు
మురసి తత్తత్కార్యములు సల్పుపగిది
నరయ భ్రూమధ్యమం దాత్మభాస్కరుడు
నిలిచి యుండినవేళ నిఖిలేంద్రియంబు
నలరారఁ దమపను లన్ని గావించి
యవల సుషుప్తియం దనుదినం బడఁగు
నవియెల్ల నీవు పాయక విను మమ్మ

అనువొంద నివియ నీవైనసుషుప్తి
నను నిత్య మొందకు నశ్వరం బగుచు
నీకు నాశము లేదు నిత్యం బటంచుఁ
బ్రాకటంబుగ శ్రుతు ల్పల్కుచు నుండు

కావున విలయ మక్కడ నికుఁ గలదె?
యీవిధ మింద్రియావస్థల నైన
భావమెల్లను తేటపఱచెద వినుము
సావధానంబుగఁ జక్కఁగ నిపుడు
ఎపుడు నీదేహంబు నెఱిఁగెడు తెల్వి
యెపుడు సుషుప్తి తా నెందును బోయె
సహజంబుగా దాని సరవి నెట్లనిన
నహ మనియెడుభావ మాసుప్తిలోను
లయ మైనవేళ నీ లాలితజ్ఞప్తి
జయముగ నచట నే సాక్షియై యుండు
ఇది లేక యుండిన నింతలో నెలమి
నిదుర మేల్కని లేచి నే నింతతడవు
పొలువొందఁగా నిద్రఁ బోయితి నంచుఁ
దెలియువా రెవ్వ రా తెల్వియు గాక
యానిర్గుణజ్ఞప్తి యందుండఁగానె
పూని యహంకృతి పొడము గ్రమ్మరనె

యానిర్గుణజ్ఞప్తి యట లేకయున్నఁ
బూని దానికి నిదె పోకడై యుండు
మందమై దేహంబు మఱచు టేమనిన
నం దహంకృతికి లేక యానిర్గుణాత్మ
తాను దానై యుండు తన్మయత్వమునఁ
గాన నహంకృతికరణి సంతతికి
నమర కారణ మయ్యె నాయహంకృతికి
నమలాత్మ కారణ మని చెప్పఁబడును
ఆరీతి యెట్లన్న నయ్యహంకార
మారయ సుప్తియం దణఁగినయప్పు
డుండు వెలంగుచు నుండును జ్ఞప్తి
యుండఁగ గద మఱి యెకకొంతప్రొద్దు
గనినపిమ్మట నైన గ్రక్కున లేచి
గను నీ ప్రపంచసంగతు లాత్మ నిచట
నుండక యున్నను నూహింపరాదు
ఖండితంబుగ సర్వకారణ మాత్మ
ఆయహంకృతి హేతు వఖిలకృత్యములు
నాయహంకృతి శూన్య మైనవేళలను
సత్యాత్మ కీప్రపంచక్రియల్ లేవు
నిత్యమై శుద్ధమై నిర్వికారమునఁ

దాను దానై తాను తనలోన వెలుఁగు
గాన నాత్మయ నిర్వికారనిర్గుణము
ఇల స్వయంజ్యోతిమై యిది ప్రకాశించె

లలిఁ దలంపంగఁ గాలత్రయంబునకు
ఆరయావస్థాత్రయమునకు దేహ
కారణాలకు మూలకారణం బగుచు
సుక్షేత్రనయనాగ్రసుషిరాంతరమున
నక్షయం బై పరమామృతనిత్య
పరిపూర్ణమై పరబ్రహ్మమై విమల
తరమై పరాత్పరతత్వమై భేద
రహితమై యమితమై రమ్యమై చూడ
సహజమై యచలమై శాంతమై యొనర
సదమలవేదాంతసారమై మఱియు
నిదురకు మొదలుగ నిర్మలం బైన
తెలివికిఁ దుదయైన దేదీప్య మగుచు
సలలిత మై సర్వసాక్షి యై దనరి
గణనాధికానందకారియు నగుచు
నణువుకు నణువైన యనవరతంబు
నామహత్తుకు మహత్తై రెంటికన్న
తా మించి పరమసత్తామాత్ర మగుచు

వెలిలోను శూన్యమై వెలిలోను నంది
వెలిలోను గాయక వెలుఁగుచు నుండు
అది నీవుగాఁ జూచి యానంద మొందు
మదియెట్ల నే నౌను నని యంటివేని
అద్దంబులోఁ జొచ్చినటువంటి గగన
మద్దంబు భిన్నమైనప్పుడు తనకుఁ
గారణమైన నాకాశానఁ గలయు
నారీతిగా బుద్ధి యణఁగినపిదప
పరికించి జీవుఁ డన్పంచవింశకుఁడు
అరయఁగ షడ్వింశకాభిధానంబు
కలిగిన యాబ్రహ్మకళయంద గలయు
నెలనాగ భావింపు మిది సౌఖ్యసరణి
నిది శాస్త్రములచేత నెఱిఁగినంతటనె
పొదలెడుసంశయంబులు వీడరాదు
వరశక్తి సుజ్ఞాన వైరాగ్యసరణి
నరయుచు నీయోగ మనవరతంబు
మననంబు చేసి సమ్మత మొందవలయు
మననంబు సేయక మఱి యుండిరేని
యామనంబున నింద్రియాదులఁ గూడి
కామాదిశత్రువర్గము నాశ్రయించు

కావున మదిఁ జక్కఁగం బట్టి నిలుప
గావలె నిల్ప కెక్కడి దీ మనంబు

తారకయోగావధాని యైనట్టి
ధీరుఁడు దాని నిందింపఁగ నేర్చు
నని యట్లు పలుకఁగ నాచంద్రవదన
తనయుని జూచి సంతస మార ననియె.

తారకలక్షణము

ఓతండ్రి తారకయోగలక్షణము
ఖ్యాతిగఁ జెప్పి నన్గడతేర్చు మనఁగ
నానంద మంది మహామహుండు గని
పూని యిమ్మెయి నొగి బోధింపఁ దొడఁగెఁ
గ్రమముగ సకలయోగంబులయందుఁ
విమలమై శ్రేష్ఠమై వెలయు తారకము
వినవమ్మ యిది రెండువిధములై యుండు
నొనర పూర్వాపరయోగంబు లనఁగ
నమర నచ్చట పూర్వమగు తారకంబు
క్రమముగ రాజయోగం బపరంబు
గరిమమై పూర్వయోగము తొల్త వినుము
దిరముగ నెల్ల మూర్తిమయంబు నగుచు
భాసురలీల రూపగుణంబు లైన
యాసోమసూర్యబింబాంతరాళమునఁ

దళతళవెలిఁగెడు తారకలోన
నెలవుగ నొనఁగూర్చి నిటలంబు చేర్చి
యెక్కింత భ్రూయుగం బొనరంగఁ బైకి
నిక్కించి నడిమింట నిల్చి చూచినను
అచట నాత్మప్రత్యయంబు లావేళ
ప్రచురంబు లై తోఁచు బహువిధంబులను
అవి చూచుచును మనం బట్టట్టు వోక
యవిరళప్రజ్ఞతో నచట నిల్చుచును
మన మట్లు నిల్చిన మారుతం బపుడు
పనివడి తాఁ బట్టువడియుండు నచట
పొసఁగ మారుతమనంబులు గూడి యున్న
నసదృశం బగుబుద్ధి కప్పు డేకాగ్ర
భావంబు కల్గు నాభావంబు సగుణ
భావంబు లెల్ల తప్పకచూచుచుండు
నాచూపు ప్రత్యయం బభ్యాససరణి
చూచుచుండఁగ నందు సుచిదంబురాశి
యందు దృశ్యంబులు నడఁగి యన్నిటికిఁ
జెందినయెఱుక తా శేషించి యుండు

మొనసి ధ్యాత ధ్యానములు లేక యుండు
వినరాక యిమ్మిగ వెల్గుచు నుండు

నది యమనస్కాఖ్యమగు వరయోగ
మదియ దానికిఁ బరం బైనది లేదు
క్రమముగ సకలయోగవిధానములకు
రమణీయ మై తాన రా జగుచుండు
కావున రాజయోగం బనుపేర
పావనమై గోప్యభావ మై యుండు
మురువుమీరఁ ద్రికూటమునకుఁ బూర్వానఁ
బరికింప నొప్పును బావనానలము
దానిపై భూమ్యాది తత్త్వంబు లైదు
పూనిన వర్ణము ల్పొలుపొందుచుండు
నానిగ్గులో నుండు ననలమండలము
దానిలోపల నుండు తరణిమండలము
మఱి దానిలోఁ జంద్రమండల ముండు
నరుదుగ దానిలో నంకురం బొకటి
అదియు భవ్యాకార మై చెల్వుమీర
నది బీజమై యుండు నఖిలంబులకును
అచటఁ బ్రవర్తించు నఖిలదృశ్యములు
ప్రచురంబుగాఁ బరాత్పరవస్తు వరయు
ఘనతరాపోజ్యోతిగతిని రేపవలు
మొనసి యంతర్బాహ్యముల వెల్గుచుండు

నారయ నుపనిషదర్థసూచకము
వేఱు చిత్తములేక విన దృఢంబుగను
అలరార నీలతోయదమధ్యమందు
వెలుఁగు విద్యుల్లేఖవిధమున మఱియు
సురుచిరనీవారశూకంబు పగిది
నరయ నీలచ్ఛాయ నలరుచు మఱియుఁ
జెలువంద పావకశిఖ దానినడుమ
బలముగ వ్యాపించి పరమాత్మయుండు
నిది బ్రహ్మ మిదె శివుం డిదియ విష్ణుండు
నదియ దేవేంద్రుండు నదియ యక్షరము
అదియుపో పరమంబు నదియే స్వరాట్టు
నదియ సత్తామాత్ర మని యార్యజనులు
తఱచుగ దైవభేదంబు లెన్నుదురు
పరతత్త్వమున భేదభావంబు లేదు
నామరూపంబు లెన్నఁగ వేఱులైన
హేమంబునకు భేద మెందైనఁ గలదె?
ఆరీతి వెల్గు నాయాత్మఁ జూచుటకు

సారమై యుండును శాంభవిముద్ర
వలనొప్ప క్షలయ గావలె నెట్టులనిన
నరుల పాడ్యమిదృష్టి యమవసదృష్టి
అల పౌర్ణవమిదృష్టి యనెడుసంజ్ఞలను
విలసిల్లుచును మూఁడు విధములై యుండు
పరగ నీమూఁటిలోపల తొలిరెంటిఁ
బరిహరింపుచు మహాప్రజ్ఞ దీపింప
సరవి మూఁడవచూపు సాధింపవలయు
నరయ నేర్పున లక్ష్య మనువెలదృష్టి
కలిగి రెప్పలపాటు కలగకుండినను
విలసితమగు శాంభవీముద్ర యగును
ఈముద్ర ధరియించి యేకాగ్రమతిని
యామద్వయము చూడ నపుడుమానసము
కరువలి క్షీరోదకన్యాయ మగుచుఁ
బరువడిఁ గూడి లోపల నిల్చియుండు
నొనరంగ నందులో నొకటి చలించి
చన రెండవదియు నాసరణిదీపింప
నారెంటి నొకచోట నమరంగఁ గూర్చి
సారంబు తనర నిశ్చలత వహించి
నిర్వికల్పసమాధి నిలచిన నదియ
సర్వంబు గనుఁగొను సత్పథం బరయ
రాజయోగంబు విరాజమానంబు
నైజమౌ సచ్చిదానందపదంబు
పాటించి బుద్ధి నీభావంబునందు
నాటించు మని పల్కు నందను జూచి
నాతండ్రి సచ్చిదానందలక్షణము
ఖ్యాతిగఁ దెల్పిన న్గరుణించు మనిన
జనని వీక్షించి విశ్వాసంబుతోడ
మునిరాజచంద్రుండు మొససి యిట్లనియె
నలినాక్షి సచ్చిదానందప్రభావ
మెలమితో నిపుడు నీ కెఱిఁగింతు వినుము
లలి నొప్పుచున్న నీలజ్యోతిలోన
విలసిత చిద్బిందు వెలుఁగుచునుండు
సరసమై యచ్చట స్ఫటికతేజంబు
చిరమైన యాపరశివకళై యుండు
జనని యాశివకళ సత్తన నొప్పు
ననఘ చిద్బిందుచిత్తనఁగఁ బెంపొందు
నది రెండు గలయుట యానంద మగుచు
వివరంబుగాఁ దత్త్వవిదు లెఱుంగుదురు

ఒనరంగ నదియ నింకొకరితిగాను
వినుము చెప్పెద దాని వేడ్క నోతల్లి
కనుఁగొన నీ సర్వకామరూపములు
ననువుగ సచ్చిదానందంబు గలదు

ఈరూపనామంబు లెసలారుచున్న
నల యస్తిభాతిప్రియములు భావింప
సత్తులింగ మనంగ సహజమై యుండు
చిత్తన నంగంబు చెలువంబు మీరు
నీరెండు నొక్కటియే యై నదృశ్య
కారణమై విశ్వగర్భమై వెలుఁగు
నలఘునాదము లింగ మనఁగఁ బెంపొందు
నల బిందు వగుచును నమరు నా రెండు
ఘనత సాంఖ్యంబైన కళ యగునదియ
పెను పగునాదంబు బిందుకళయన
నీమూఁటి కాధార మేస్థాన మనిన
కోమల మైన త్రికూటస్థలమున
లలితమై యొప్పునీలచ్ఛాయవలెను
పొలుపొందునట్టి యాపోజ్యోతినడుమ
విలసితచిద్బిందు వెలుఁగుచు నుండు
నలర నాబిందులో నలఘునాదంబు
పలుకుచు నుండును బరమార్థ మైన
కలనాదబిందుసంకలితమై యుండు
అదె మూలప్రకృతియు నదె దేవహూతి
పదిలంబుగాను త్వంపద తత్పదములు

అసిపదభావ మింకలర తేటగను
పొసఁగఁ జెప్పెద విను బొంపిరివోవ
తనరంగఁ ద్వంపదార్థము జీవుఁ డనఁగ
విను తత్పదార్థంబు విమలచిదాత్మ
ఈ రెంటి కైక్యంబ యెస నసిపదము
సారోక్తిగా నీవు సరణి భావింపు
మదె తత్వ మదె భావ మదె నిరాలంబ
మది సర్వసాక్షి నీ వదియ తలంప
నలరఁగ నీచంద మనవరతంబు
తలఁపుచు నుండు నంతర్లక్ష్యమందు
వెలుపల లోపల వెలిని యానడుమ
పొలుపొంద వెలుఁగు నాపోజ్యోతియందు
నిదుర జెందినరీతి నిల్చితివేని
యదియ యంతర్లక్ష్యమని చెప్పఁబడును
అది మహాకాశచిదాకాశ మనఁగఁ

బొదలు చిదంబరం బొనరంగ వినుము
తనరార నీనభాధారము చేసి
యొనరంగ నొకటితో నొక్కటిగూర్చి
యగణితం బైనచిదంబరస్థలిని
తగ నిల్ప నదియ యంతర్లక్ష్య మగును

జనని నీమనము నిశ్చల మైనదనుక
మొనసి యంతర్లక్ష్యముద్ర యేమరకు
మది యేమఱిన నిర్జరాదుల కైన
మది సంశయంబులు మానవు దల్ప
కావున నీవిష్ఠ క్రమము దప్పకయ
కైవల్యచిన్మాత్రకళయందు బుద్ధి
నాటించి సచ్చిదానందపదంబు
పాటించి నీవని భావింపుచుండు
తెలిసిన తెల్వియుం దెలియని మఱపు
తెలియ కానందాబ్ధిఁ దేలి యుండినది
బ్రహ్మసాక్షాత్కారపద మని తెలియు
బ్రహ్మానుభవ మందె పట్టుగ నిల్పు
మెఱుక నీ వనుచు నీ వెఱిఁగిన వెన్క
వఱల నీ దేహంబు వాసన ల్మగుడ
కలిగిన నది బంధకము గాదు నీకు
వల నొప్ప సాదృశ్యవాక్యంబు వినుము
చెలువొంద ముత్యపుఁజిప్పలో వ్రాలి
సలిలంబు ముత్యమై సరవిఁ జిప్పనొగి
తొల్లిటివలె నీలతోయమై పోవు
తల్లి నీ వారీతి ధన్యత నొందు

నీయాత్మ నీవయై నిల్చినవెన్క
మాయ నిన్నంటునే మాయ యేదనిన
నిన్నుఁ గానక తన్వు నీ వన భ్రమసి
యిన్నాళ్లు పరమార్థ మెఱుగకయున్న
ఇదియపో మాయ యిం కెయ్యది గాదు
మది నెన్న నొకరూపు మాయకు లేదు
అదియ నిర్వచనీయ మదియని గాదు
అది గల్గి లేనిది యదియ యవిద్య
యది యెట్లు జనియించు నది యెట్లు లడఁగు
నది తేటపఱచు మనంగ నిట్లనియె.
పరిశుద్ధమైన నభంబు వీక్షింప
సొరిది నీలచ్ఛాయ చూపట్టునటుల
నిర్మలమై వెల్గు నిర్గుణమందు
గర్మంబు గర్మగఁ గల్గినమాయ

యెందెందుఁ జూచిన యేకమై పొంది
యుంది యంచును జూడ నుండును మాయ
యెందు లేదని చూడ నెటులేదు మాయ
యందు నీలత్వ మాకాశంబునందు
నెటువలె దబ్బరో యెఱుకతోఁ జూడ
నటువలెనే దబ్బ రై యుండు మాయ

యిదివరదాక ని న్నెనసినమాయ
మదితోడ నీమాయ మాయమై పోయె
మాయలోపల మాయ మహనీయమాయ
యీయఖండజ్ఞప్తి యెఱుఁగనిమాయ
యిటువంటిపరమార్థ మిద్ధాత్రిలోన
కుటిలచిత్తులకు సద్గురుదూషకులకు
నత్యంతవిషయేంద్రియాసక్తులకును
సత్య మూహింపని సంశయాత్ములకు
భీతాత్ములకు మిత్రభేదవాదులకు
నీతిశూన్యులకును నిర్దయాత్ములకు
కామంబు గల యహంకారచిత్తులకు
గామకర్మాసక్తి గల్గువారలకు
నుపదేశ మిచ్చిన నూరక లేని
విపరీతసంశయవితతులు చెలఁగు
గాన ధృఢజ్ఞానకలితులు గారు
గాననీసద్విద్య గావలె నంచు
నడిగి నప్పు డనిశ్చితార్థుఁ డటంచు
నెడఁబాయకే విద్య యియ్యఁగరాదు
ఈవిద్య కర్హుఁ డిం కెవఁ డంటివేని
పావనవైరాగ్యపద్ధతు లెఱిఁగి

తలఁగక మొదటిసాధనచతుష్టయము
చెలఁగ కభ్యాసంబు చేసినవాఁడు
శమదమాదులు గల్గి సద్గురుపాద
కమలంబులే గతి గా నమ్మువాఁడు
కనులముందఱ పరాంగన నిల్చియున్న
తను గన్నతల్లిగఁ దలఁచినవాఁడు
పరులవిత్తము లగుపడిన వీక్షించి
సరగునఁ దనకేలు చాఁచనివాఁడు
ఎక్కడి సంసార మెక్కడ గల్గు
నెక్కడ నడఁగు నే నెవ్వఁ డటంచు
దనుదాన వెదకుచుం దనమనంబునను
పని బూని యీశ్వరార్పణము చేయుచును
విగతసంకల్పుఁ డై విహితకర్మములు

తగ సల్పుచును భూతదయగలవాఁడు
సంతతంబును యదృచ్ఛాలాభమునకు
సంతసింపుచు సాధుజనులతో మైత్రి
శాంతవర్తనముచే సల్పెడువాఁడు
శాంతవేత్తల నొక్కసారి వంచించి
యది దెల్పు మిది దెల్పు మని త్వరపడక
సదమలుఁడై ధర్మ మనవరతంబు

కారణగురుమూర్తిఁ గన్గొన్నలోన
సారెకు మెలఁగుచు సామి యింకేమి
శరణంబు లేదు మీచరణద్వయంబ
శరణంబు నాకు నిశ్చయముగా ననుచు
బదరి తా నడుగక భక్తి యేమరక
చెదఱక శుశ్రూష చేసెడువాఁడు
అవనిలో విద్యకు నర్హుఁడై యుండు
నవలసంశయములు నన్నియుం దీరు
నిటువంటిసద్విద్య నెఱుఁగనేరకయ
మటుమాయచేఁ జిక్కి మదమత్తులైన
ఘోరాత్మకులు వారు గొట్టెలుగాక
వారి కెక్కడిది జీవన్ముక్తిసుఖము
అందందుఁ బాపతిర్యగ్జంతుతతుల
యందు జనింపుచు నడఁగుచు నుండు
పొలుపొందనటుకొంత పుణ్యావేషంబు
కలిగి యామనుజుఁడుగాఁ బుట్టి యపుడ
కనవచ్చు మోక్ష మేగతినైన నిపుడు
గనలేనివానికిఁ గల్గునే యవల
నిపు డిట్టి సుజ్ఞాన మెఱుఁగనినారు
చపలాత్ములై మఱి జన్మజన్మమున

పాపంబు చేసి తత్పారంబు లేని
కూపాన మఱి మునుంగుచుఁ దేలుచుందు
రిటువంటిసంసార మెసలారు చుండి
పటువిరక్తిని దోసి పరమాత్ముఁ డైన
కారణగురు చేరి కడతేరినట్టి
ధీరమానసుఁ డాదిదేవుఁ డై నిల్చి
పన్నుగఁ దనఘటప్రారబ్ధమునను
ఎన్నిదినంబు లిం కీధరయందు
విహరింపుచుండును విశ్వమంతయును
మహిమ మీర వినోదమాత్రుఁ డై చూచుఁ
దలఁపున విధినిషేధము లెంచఁబోఁడు
చెలఁగి తా నొకరిని సేవించఁబోఁడు

భేదవాదులతోడ బిట్టుగఁ దర్క
వాదము లాడఁడు వదఱఁ డెప్పుడును
ఎందుఁ జూచినఁ గాని యెఱుఁగనివాని
చందంబుతోఁ గడు సాత్వికుఁ డగును
నతులప్రకాశుఁ డై యానంద మొందు
నతఁ డిల నవధూత యనిపించుకొనును
విలసితముగ బ్రహ్మవేత్తలక్షణము
తెలిపెద విను మింకఁ దెఱుఁగునోతల్లి
గురుకటాక్షంబున గుఱియందు భ్రమసి
గురుతరసంసారగోష్ఠియందుండు
నమలుఁడై లౌకిక మనుసరించుకొని
యమరంగ శత్రుమిత్రాదుల బ్రహ్మ
భావంబుగాఁ గని పరమతత్త్వైక్య
భావుఁడై యెపుడు నిర్భరచిత్తుఁ డగుచు
వాసి నింద్రియముల వ్యాపారములను
జేసి యడంగును సిద్ధం బటంచు
పరమాత్మ తా నను భావ మేమనక
యరుదుగ సంసారి యగు నొకవేళ
నుప్పొంగి యోగియై యుండు నొక్కతఱి
నెప్పు డెట్లుండుట నెఱుఁగంగ రాదు
ఘనమైన రాజయోగప్రకారమునఁ
దనయభీష్టముగ స్వతంత్రుఁడై మఱలు
జల మంటనట్టియా సరణి దీపించు
నలరు దేహంబున నబ్జపత్రమునఁ
దనరంగ జలమునఁ దా నంట దెపుడు
మనుజులు కొంద రా మహిమఁ గానకయ
సంసారియై మనచందంబు నుండి
హంసస్వరూప మె ట్లగును వీఁ డంచు
దూషించుచుందురు దొడరి యారీతి
దూషించువారికిఁ దొలఁగక యోగి
చేసిన దుష్క్రియ ల్చేరు నాక్షణమ
వాసిగఁ గొంద ఱా పరయోగియందు
నిలుకడగా భక్తి నిల్పి సంతతము
వెలయుఁ దద్గుణములు వినిపించు చున్న
వారికి నాయోగి వాంఛలు లేక
ధీరుఁడై చేసినదివ్యపుణ్యములు
చేరుచు నుండుఁ బ్రసిద్ధంబుగాను
సారె కీలోకానుసారంబుకొఱకు
నిర్మలుఁడగుయోగినేర్పునం జేయు

కర్మముల్ రెండుభాగంబులై పోవు
నతనికి నీరెండు నంట దూహింప
నతఁడు నిర్విషయుఁ డై యానందమొందు
అల తొలియవధూత యాబ్రహ్మవేత్త
పొలుపొందుసమయము పొందుచుండునొగి
అతఁడు విరక్తుడై యడవిలో నున్న
నితఁడు సంసారియై యింటిలోనున్న
నెక్కువ తక్కువ లెన్నంగరాదు
తక్కక మోక్ష మిద్దరికిని సమము

పొలుపొంద నంచితపూర్వజన్మమున
బలముగఁ గేశవోపాసన చేసి
గురుతరమోక్షంబు కోరినకతన
పరువడి తా సుఖప్రారబ్ధగతిని
అరుదుగ సంసారి యై ముక్తి నొందెఁ
బరికించి చూడ నప్పరమావధూత
అల పూర్వజన్మంబునందు శంకరుని
చెలఁగి యుపాసనచేసి భావమునఁ
గ్రమమున మోక్షము కామించుకతన
రమణీయలీల విరక్తుఁ డై నిల్చి
మోహపాశములను మొదలంటఁ గోసి
సాహసుఁడై ముక్తి సాధించుకొనియె
నిరువురకును మార్గ మేకమేగాని
ధరఁ దల్లి వినుము భేదము లేదు చూడ
మదిలోన నీ విట్టి మహిమ భావించి
మదికి రమ్యం బైనమార్గమం దుండి
గురుతరముగఁ బంచకోశంబులకును
బరము నీ వైయున్న భావంబు గనుము
అన విని యాదేవి యాత్మజుఁ జూచి
విను మోపరబ్రహ్మ వేదాంతవేద్య

పంచకోశ ప్రకరణము

పంచకోశంబుల భావముల్ దెలియ
నంచితంబుగఁ దెల్పు మన నతం డనియె
విను మంబ యన్నంబు విఖ్యాతి బ్రహ్మ
మని శ్రుతియందలి యలరంగఁ బడియెఁ
గమలాప్తవార్షికకరములవలనిఁ
గమలంబు లుదయించె ఘనసస్యసమితి
నాయె నయ్యోషధు లన్నమై యొప్పె

నాయన్నరసము దేహం బయ్యె నిట్లు
అది యాత్మ యని కొంద ఱండ్రు దృగ్దృశ్య
మది నశ్య మని నిగమాంతము ల్వలుక
గాన దేహం బాత్మ గాదు భావింప
మానిని యీప్రాణమయ మాత్మ యంచు
పదరి కొందఱు మించి పల్కుచుండుదురు
విదితంబుగా దానివిధము భావింప
నది సూక్ష్మదేహాంగ మది యస్థిరంబు
నది యాత్మ యని చూడ నర్థంబు గాదు
అల మనోమయకోశ మాత్మ యటంచు
చెలరేగి కొందఱు చెప్పుచుండుదురు
అది సంశయాత్మకం బది యణుమాత్ర
మది చంచలము గల్గ నాత్మఁ గాఁబోఁడు

ఆలఘువిజ్ఞానమయబ్రహ్మ మగుచుఁ
బలుమాఱు కొందఱు పల్కుచుండుదురు
దానికివృత్తి సంతతమును గల్గు
గాన నావృత్తి యఖండప్రవాహ
రూప మౌ నది యాత్మ రూపంబు గాదు
కాపట్యరహిత నిక్కంబుగ వినుము
ఆనందమయకోశ మట పంచకంబు
దానికి నభిమాని తనర మాయావి
పరగంగ సైంధవోపాధిచే నతఁడు
కర మొప్పుజగములు గల్పించు నడఁచు
ధరశుద్ధసత్వప్రధాన మైనదియె
యిరవొంద మాయను నెసలారఁ దల్లి
మాయావి యరయ బ్రహ్మం బనుయుక్తి
పాయక కొందఱు పల్కుచుండుదురు
వనజాస్య యద్వైతవాదులమాట
కనుమతింపక మిథ్య యని తలంచుదురు
అతఁ డీశ్వరుండు విశ్వైకకారణుఁడు
అతులితమాయావి యైన దెట్లనినఁ
బూని చెప్పెద నది పొందుగఁ దెలియు
భూనభోతోయదముల జలబిందు

మొగి సదాంతర్బాహ్యముల ప్రతిఫలిత
మగుచున్నయిటువంటియాకాశ మటుల
అలఘుమహాబింబమాత్రుఁడై తనరి
వల నొప్పగాను సర్వజ్ఞత్వముఖ్య
విలసితగుణగణాన్వితుఁ డైనకతన
నలినలోచన సగుణబ్రహ్మ యనఁగ

నటియింపు చుండు నానావిధంబులను
నటు గాన నిర్గుణ మని చెప్పరాదు
మఱి తల్లి విను మన్నమయకోశ మమరఁ
గర మర్థి నీస్థూలకాయమై యొప్పె
నవ్వలకోశత్రయంబు భావింప
నవ్వల సూక్ష్మాంగ మలరారు చూడ
అలఘుపంచమకోశ మయ్యెఁ గారణము
తలఁప మాయారూపు తను వయ్యె నట్లు
ఆమాయ నాత్మజ్ఞు లందు లే దండ్రు
వామాక్షి సంశయవారితంబుగను
పరఁగఁ జిత్తమును నభస్థలమైన
సురుచిరం బాశ్రయ శుద్ధవిజ్ఞాన
పటిమచే నైశ్వర్యభావంబు నొందు
నట భ్రాంతిచేఁ గల్గినటువంటిమాయ

సకలాశ్రయబ్రహ్మ సంవిత్తుచేత
నకలంకముగ నష్ట మౌక్షణంబునను
జననిబుద్ధాబుద్ధజను లిందుఁ గొంద
ఱనుమతింపక యుందు రాయుక్తి వినుము
అలరంగ రజితాని కలభిన్నధర్మ
ములు గల్గి యాభాసమును గల్గె నంచు
తొలినుండి భిన్నసత్తులు గావు విశ్వ
ములకుఁ బరబ్రహ్మ మనియెడువాఁడు
ధరణీస్థలిని వేదతత్త్వండుగాని
పరగ మూఢుం డట్లు భావింపఁ గలఁడె?
అటువలె నిశ్చయం బందె నీమనము
నిటులైన విశ్వ మేదెసఁ దలంపంగ
మదిలోనఁ దన కనుమానంబు కొంత
కదిసి యున్నందున కల్గె నవ్వేళ
జనని యివ్వలపుచ్చ సద్బ్రహ్మ మనఁగ
ననువొందఁ బంచకోశాతీత మయ్యె
నది యసత్యం బన్న నన్నృతంబు వెలయు
నదియ నీవును నేను నఖిలవిశ్వంబు
సచ్చిదానందాబ్ధి సంపూర్ణ మగుచు
నెచ్చక తగ్గక యేకమై యుండు

నది మనం బందెఁ దదన్యభావమున
విదితంబుగాఁ జూచి విశ్వంబు మఱువు
మది యెట్లనిన నీసమాధానమతిని
ముద మొప్ప వినుము నే మొనసి చెప్పెదను
పని బూని వామగుల్భమున నాధార

వనజంబు పిడించి వామేతరంబు
వామాంకతలమున వైపుగ నిడిన
యామహనీయముక్తాసన మాయె
నియ్యాసనంబున నేకచిత్తమున
నెయ్యంబుతో నిల్చి నిక్కించి నడుము
దృష్టి నాసాగ్రానఁ దిరముగ నుంచి
యష్టమదంబుల నడఁచి పిమ్మటను
ఘటపటాదులమాయగాఁ జూచి యచట
ఘటిత మైనది సత్తుగాఁ గనుంగొనుము
ఆసత్తు విస్ఫురణాకార మగుచు
భాసురచిత్తుగఁ బ్రబలుటఁ దెలిసి
రహిస్థూలసూక్ష్మగారణముల వెలుఁగు
సహజవస్తువు నేకసరణిగఁ గాంచి
అరయ ననేకోర్వియండకోశములు
వరుస నావరణతత్వముల నన్నిటిని

హెచ్చుగ నోతల్లి యెలరార వినుము
సచ్చిదైక్యంబుగ సమరసింపుచును
అస్తిభాతులచేత నడఁచి వైచుచును
వస్తుమాత్రం బెల్ల నారూప మంచు
నారూప మెంచ స్వయంజ్యోతి యేక
మారూఢి సరణిచే నాత్మగాఁ గనిన
నాయాత్మ నాదిమధ్యాంతము ల్దొలఁగి
మాయావిరహితమై మదిభేద ముడుగు
నప్పుడు ఘనసచ్చిదానందపూర్ణ
మొప్పుగ నీవగుదుర్విలోకముల
కరమర్థి నపుడు జగద్వాసనముల
దొరఁకొని మనమందుఁ దోఁచినగాని
హస్తిభాతుల చేత నాత్మగాఁ గనుచు
నిస్తరంగం బైన నీరధిపగిది
కలలేని నిద్దురగతిని భేదంబు
తొలఁగి సంపూర్ణమై తుర్యమౌ నంచు
నిర్వికల్పంబున నిశ్చలత్వమున
సర్వ మఖండమై సత్యమై నిత్య
శుద్ధబుద్ధవిముక్తి సొంపొంది పరమ
సిద్ధాంతసిద్ధమై చెలఁగుచునుండు

నోయమ్మ యచట నేనుండినయపుడ
నీయాత్మ నర్పించు నిశ్చయంబుగను
వలనొప్పఁ దెలియఁగ వలెనని యాత్మ
నలరార నర్పించు నట్టిచందంబు

క్రమముగఁ దెల్పె నుత్కంఠ దిపింప
నమలమానస యైన యాదేవహూతి
అలఘుత్వ మైనముక్తాసనమందు
నలువొందఁ గూర్చుండి నడుము నిక్కించి
మెడ దృఢంబుగ నిల్పి మిహిరాబ్జరిపుల
నడరంతఁ గూర్చి నాసాగ్రంబు చేర్చి
అనుపమసద్బోధ యనువహ్నిలోను
జనియంచినట్టి విజ్ఞానదీపంబు
కరమొప్ప మతియను కరమునం బూని
చొరవఁగ హృద్వీథిఁ జొచ్చి శోధించి
అచ్చటినాళంబు లచ్చటిక్రమము
లచ్చటిచోద్యంబు లరసి చూచుచును
చెలువగు దేహపశ్చిమభాగమందు
నిలిచి వీణాదండ నిజమై తనర్చి
యొనర దీర్ఘాన్తియు నొఱపుగ నమరి
తనుతరంబై బిసతంతుచందమున

సురుచిరం బైన సుషుమ్నంబునంటి
కరమర్థితో నూర్ధ్వగమనంబు చేతఁ
జె న్నలరిన మేరుశిఖరిపైఁ జేరి
కన్నచోటున బయ ల్కలయ భావించి
నొలయ కప్పుడు వెలి చూపులోఁ జూపు
నలరారఁగాఁ జూచి యట రెండు విడచి
మహనీయతరమైన మధ్యలక్ష్యమున
సహజంబుగా నిల్పి సంతసమంది
నెలవుగ నాత్రివేణీసంగమమునఁ
జలన మొందక నిల్పి స్నానంబు చేసి
లాలితజ్ఞప్తి కళామాత్రమైన
లీలనొందెడి యాత్మలింగంబు గాంచి
అర్మిలి దీపింప నర్చింపఁ దలఁచి
పేర్మిగల్గిన చతుష్పీఠమందుంచి
అమలమౌ తత్వమస్యాదివాక్యములు
క్రమముగ మంత్రము ల్గా స్మరింపుచును
ప్రణవం బనెడుఘంటపట్టి వాయించి
గణనము చేయక కామాదు లనెడు
ఘనవిఘ్నకారిరాక్షససమూహముల
మునుకొని బలుదూరమునఁ బారదోలి

కూర్మితోఁ బూర్వ మాగురుని కర్పించి
కర్మనిర్మాల్యంబు కడపట ద్రోచి
ఆలమట శమదమం బనెడుతోయమున

నలరు నర్ఘ్యము పాద్య మాచమనంబు
నలువొప్ప నొసఁగి స్నానంబు చేయించి
బలమైన సమదృష్టిభావన యనెడు
పరిశుద్ధసాత్వికాంబరము ధరించి
యరుదుగ శక్తిత్రయము నొనఁగూర్చి
తనర యజ్ఞోపవీతంబుగ నిచ్చి
యనుపమసద్విద్య యనుగంధ మలది
తనభూతదయ నక్షతలుగ ధరించి
సునయగుణములను సుకృతవాసనలు
తనరు పుష్పములు సద్భక్తియన్పూజ
మనము రంజిల్ల సమ్మతముగఁ జేసి
రమణీయమగు నంతరంగచతుష్ట
యము ధూపముగనిల్పి యఖిలేంద్రియాది
ప్రమదముపేర్మి దీపంబుగ నొసఁగి
యమరినజపతత్వమగు సుధారసము
మునుకొని నైవేద్యముగ సమర్పించి
తనరార నానందతాంబూలమిచ్చి

పరఁగాత్మప్రత్యయప్రభ సముజ్వలము
పరఁగ సువర్ణపుష్పంబుగనిచ్చి
పంచభూతములఁ బ్రపంచమంతయును
పంచార్తులుగ సమర్పణ మొప్పఁజేసి
ఆట చిత్తవిశ్రాంతి యనుప్రదక్షిణము
పటుముదంబునఁ జేసి బ్రహ్మైక్యమనెడి
ఘననమస్కార ముత్కంఠతోఁ జేసి
తనలోనిపరమాత్మ దాఁ జూడఁగాను
చూపురూపుననంటి సొరిదిగనట్టి
చూపురూపైక్యమై సుస్థిరమైన
ఆత్మలింగము తానయై ప్రకాశించు
నాత్మానుభవమునం దలరుచుసొక్కి
మననంబు మఱచియు న్మనుజెందునపుడు
మొనయ జ్ఞాతృజ్ఞానములు జ్ఞేయమందు
గూఢమై యవివేకగూర్మి యంతయును
రూఢిగ సచ్చిత్సురూపమైనట్టి
నిర్వాణపదమందు నిండియేకముగ
నిర్వికల్పంబున నిద్దురఁజెంది
తానునై కొంతతాఁ దడవుండి లేచి
మానినీమణి సత్కుమారునిం గనియె

జయసర్వభూతాత్మ జయపరమాత్మ
జయచిన్మయాకార జయవేదసార

జయకలుషవిభంగ జయమహాలింగ
జయసత్యసంకల్ప జయనిర్వికల్ప
నీకటాక్షంబున నిర్గుణమంద
ప్రాకటంబుగ నైక్యభావ మొందితిని
ఆయాత్మలోపల నఖిలవిశ్వంబు
మాయగనున్నది మైనీడమాడ్కి
నదిసత్యమన్న మహాద్వైతమందు
నుదితస్వదంతర మున్నదేతండ్రి
వ్యావహారికమాత్మ నంగీకరించి
వావిరిరెండని వచియింపవలసె
గురుతరంబుగఁబూజ గొనెడువాఁ డెచట
చిరభక్తితోఁ బూజ సేయువాఁడెవఁడు
సరవిఁబూజింపఁ బూజాద్రవ్యమేది
అరయఁగ వాఙ్మానసాతీత మగుచు
సొరిదిగ నిన్నుఁ బ్రస్తుతి చేయు టెట్లు
పురుడించు సర్వప్రపూర్ణమౌ నిన్నుఁ
జెలఁగి యావాహన చేయుటయెట్లు
తలఁప సర్వమున కాధారమౌనీకు

విహితాసనంబు గావించుటయెట్లు
మహితగుణంబును మఱియుండునీకు
దనరార నర్ఘ్యపాద్యము లిచ్చు టెట్లు
మొనసి సత్పరిశుద్ధముగ నుండునీకు
నలరార నాచమనాదుల యెట్లు
మలినంబులేక నిర్మలముగ నెప్డు
వెలుఁగుచుండెడు నీకు వేఱతోయమునఁ
జెలువుగ స్నానంబు సేయించుటెట్లు
కొమరొప్ప విశ్వాసకుఁడవైన నీకు
నమరంగ నొకవస్త్రమర్పించు టెట్లు
మొనయఁగ గులగోత్రములు లేనినీకుఁ
దనర యజ్ఞోపవీతము లిచ్చుటెట్లు
పొలుపొంద నవయవంబులు లేనినీకు
వలనొప్ప భూషణావళిఁ దాల్చుటెట్లు
అనఘ నిర్లిప్తుఁడ వైయున్ననీకు
మును గుసుమార్చనంబును జేయుటెట్లు
సలలిత గుణనిరంజకుఁడవౌ నీకు
నెలమిగ ధూపంబు లిచ్చుటయెట్లు
వనజాప్తచంద్రపావకులరూపముల
నొనరెడు దీపంబు నొసఁగుటయెట్లు

పొలుపార నిత్యతృప్తుఁడవైన నికు
నలరఁగ నైవేద్య మర్పించుటెట్లు,
మొనసి సదానందమునఁ జొక్కునీకుఁ
గొనకొని విడెము మక్కువనిచ్చు టెట్లు
మురువగు నాద్యంతములు లేనినీకుఁ
బరువడి మంత్రపుష్పము నిచ్చుటెట్లు
సునిశితస్వప్రకాశుఁడవైననీకు
నొనర నీరాజన మొసఁగుటయెట్లు
అనిశ మనంగుఁడ వౌనీకు భక్తి
మొనసి ప్రదక్షణమును జేయుటెట్లు
వారక యద్వైత వస్తువౌనీకుఁ
జేరి ప్రణామంబు చేయుటయెట్లు
సారస్వతుల కగోచరమైన నిన్ను
ధీరత్వముగ వినుతించుటయెట్లు
పొలుపొంద నిశ్చింతముగ నుండునదియె
నెలవుగ నిన్నుధ్యానించుక్రమంబు
ఊరక నిష్క్రియ నుండుచందంబె
భూరిభక్తిని నిన్నుఁ బూజించువిధము
ఘననిశ్చలత్వంబు గల్గియుండినదె
యొనరప్రదక్షణం బొనరించు సరణి 390

నలరు సోహంభావ మందునిల్చినదె
చెలఁగి ప్రణామంబు సేయుభావంబు
మొనయ నాత్మజ్ఞానమున నేకనిష్ఠ
నొనరు సంకీర్తన మొనరించురీతి
పరిపూర్ణ భావసంపద గల్గినదియ
పరమైనమంత్రజపంబు సేయుగతి
అలరార నెపుడు కృత్యాకృత్యములను
దెలియక మరచుట దివ్యశమంబు
అంతియకాని మహాబ్రహ్మమందు
వింతగభావంబు వేఱేమి లేదు
మతియున్న దదియున్న మాడ్కిఁ గన్నట్టు
మతిపోవ నదిపోవు మాయమాయగనె
అతులితబ్రహ్మమం దాకలంకంబు
సతమౌనె చూడ వసంతకాలాన
సతులితంబుగనుండు నబ్జాప్తుకరణి
వితతి ప్రకాశింప వింతగ నందుఁ
బెదరెడి మఱుమరీచిక చూచి జలము
కదలుచున్నది గ్రోలగావలెనంచు

భ్రాంతిచే మృగములు పరువెత్తుకొంచు
నెంతదూరమువోవ నెదురుగజలము

కదలిపోవుచునుండు కైవడిగాను
మదికి దృగ్వ్యాపారమహిమ లోఁదోఁచుఁ
గాని లేదనెడి నిక్కముదోఁచవోదు
గాను దద్భ్రాంతిచేఁ గడఁ గనలేక
సుడివడితిరిగించు సుడిగుంటరీతిఁ
గడఁగానరాని యఖండాత్మకాంతి
అతిశయంబునఁదోఁచు నఖిలప్రపంచ
మతిసత్యమై యుండునట్లుండుగనుక
జనులీప్రపంచ మసత్యమటంచు
గనుకంటభావించి కడఁగానలేక
సతతంబు నీ ప్రపంచము నిత్యమంచు
నెంతకాలంబున్న నెదురుగజలము
గనుపించుచుండును గానియాలేమి
గనుపించ దీకర్మకాండంబు చూడఁ
గావున నీకర్మకాండచేఁ బుట్టి
వోవుచుందురు ముక్తి పొందంగ లేక
ఘనతరసుజ్ఞానకాండను సత్తుఁ
గనినధన్యులకు మోక్షంబుసిద్ధించు
పరగరజ్జువుఫణిపగిది తొ ల్తఁదగి
యరసిచూచినవెన్క నదిలేనిమాడ్కిఁ

బరమాత్మయం దీ ప్రపంచంబు మొదలు
తెఱుఁగొప్పుచుండు నీతీరున నెపుడు
పావనసుజ్ఞానపటిమచే దాని
భావించిచూడఁగ భగ్నమైపోవు
ఇట్టిమిథ్యారూప మెసఁగువిశ్వంబు
పట్టుగ నిరత మీ బ్రహ్మంబునందు
నున్నదియని కొంద ఱొనరభాషింతు
రున్నదిసత్తైన నున్నదేజగము
తాను దాననుదాని తలఁచినంతటను
నేను నేననువాఁడు నీరసంబయ్యె
నేనెవ్వఁడోయని నేను భావించి
నేనుగా కటుమున్నె నేనుదానయ్యె
నేను తానైక్యమై నిలిచిచూడంగ
నేనుదాననరాని నేనునేనైతి
లలినెంచసలిలము లవణమైయుండి
సలిలంబులోఁబడి సలిలమౌకరణి
నాబ్రహ్మ మీజీవుఁ డనిపించి పిదప

నాబ్రహ్మమును బొంది యదియుఁదానయ్యె
మొనసి పరబ్రహ్మమును నేనుగంటి
ననుమాట లేభ్రాంతి యదియెట్టులనినఁ

దనముఖంబెవఁడైన దర్పణమందుఁ
గనిదర్పణముదీసి కడనుంచినప్డు
మునుదాను దర్పణమున జూచుచున్న
తనప్రతిబింబంబు తనలోనఁగలయు
నలరంగఁ బరమాత్ముఁ డాబుద్ధియందు
జెలువొంద బ్రతిఫలించినతన్వదాను
కనుచున్న తఱిబుద్ధి గరిగివోవగునె
తనప్రతిబింబమై తనమాడ్కినుండు
జీవుండు తనయందుఁ జెందుటకాని
జీవుండు తన్నుఁ జూచిన నెందుఁగలదు
ముఖదర్పణంబులో మొనసిబింబంబు
ముఖము తాననిజూచి ముదమందుఁగాని
ముఖముకైవడి నద్దమునఁ గాన బడును
ముఖముసత్యంబైన ముఖము గన్గొనునె?
అలబుద్ధిచూపునా యభవుండటంచు
పలికినజడమది భావింపలేదు
గను లద్దమును జూచుఁ గాని యద్దంబు
కనులఁ జూచుటలేదుగద పరికింప
నెలమి నద్దము లేక యీక్షణయుగము
వెలయఁగఁ దనుదాను వీక్షింపఁగలదె?

కనుదోయిఁదనుదాను గనిసంతసింప
దనరనద్దంబు సాధనముగ నుండు
నారీతిపరమాత్ముఁ డాత్మప్రకాశ
మారూఢిఁగాఁ జూడ నమరుచు బుద్ధి
అలరారసాధన మైయుండుఁగాని
యలరుభావాతీత మైనబ్రహ్మమును
గనెడుసాధనమెందుఁ గలదెన్నటికిని
గనుచుండునదె సాక్షిగాసంతసంబు
పరిపూర్ణతరమగు బ్రహ్మైక్యమునకు
సరవిగనొకదిక్కు చనుటేల యెలమి
అలరునవిద్యాదు లనెడునుపాధు
లలరార నశియించు నాక్షణమందె
యుండెడుచేతనే యుండుపూర్ణముగ
నుండెడు బ్రహ్మమం దూరకేకలయు
సరవిమై నుండును సాదృశ్య మొకటి
వెఱవుగ నీకు నే విన్నవించెదను

ఘటము భిన్నంబైన ఘటపటాకాశ
మటగగనంబున మఱియుండుఁగలసి
ఆమఠం బడఁగిన నామఠాకాశ
మామఠాకాశము నందుండిగలయు

నారీతిగానట్టు లైనపిండాండ
కారణవిద్య దగ్ధంబయిపోవు
సొరిదిగాకుండిన చోటనయుండి
సరగున జీవుఁ డీశ్వరునిలోఁ గలయు
నారీతిగా దివ్యమగుశుభకాండ
కారణమగు మాయ క్రమమదె ముందె
కప్పురంబునుగాల్పఁ గడపటదాను
నుప్పరంబున పోవుచుండినరీతి
అలవిద్య తుదకు మహాబ్రహ్మమంది
వెలిఁగిలయంబొంది వేఱతాలేక
గానగు నావిద్య గల్గినయపుడ
వూని ప్రపంచబుద్బుద మొండులేదు
అంతట యిది మిథ్య యనరాని యెఱుక
వింత యొక్కటి లేక వెల్గుచునుండు
నటువంటిబ్రహ్మమేనైతి కలంక
మెటులైన జనియింప దిది నిశ్చయంబు
బట్టబైటను మోక్షపద మిట్లు దనరు
నెట్టులఁ గనుగొందు ఱీబ్రహ్మవిద్య
అప్పు డాకపిలాఖ్యుఁ డా దేవహూతి
నొప్పుగఁ గన్గొని యొగి నిట్టు లనియె

జననిరో బహుజన్మసంస్కారమహిమ
ఘనతరమైయుండె గనుక శీఘ్రముగ
పరమనిర్గుణపరబ్రహ్మైక్యభావ
మరుదుగఁ బొందితి వంతియ చాల
నందఱ కిది లభ్యమైన ప్రపంచ
మెందుండు నటమీఁద నెనలార తల్లి
అనువుగ నెపుడున్న యదిలేని దంచు
నెనకలరీతి లేనిది యున్నదంచు
బలముగ భావించు ప్రాకృతజనము
వలన విశ్వం బట్లు వర్తింపుచుండు
నొనరంగ వారు లేకుండినమాయ
కునికి యెక్కడ లేక యూరకపోవు
దానికి యుక్త మాత్మజ్ఞానవిద్య
గాన తద్విద్య నిక్కము గుప్త మగుచు
వరపతివ్రతరీతి వర్తింపుచుండు

కర మొప్పుచుం గర్మకాండాదులెల్ల
సామాన్యగణికాళిసరణి నటించు
కామయుక్తులకు భోగముల నొసంగు
ఆభోగముల రోసి నటువంటిఘనుల
చే భగ్నమగుదాని చిత్రమంతయును

అటమీఁదఁ దానాత్మ ననెడునిశ్చయము
దిటవుగఁ గల్గుసందేహంబు తలఁగు
నంతట పరిపూర్ణమై తానువెల్గు
నింతంత కీకర్మ మెఱుఁగంగరాదు
సులభంబుగల్గు నీ సుజ్ఞానవిద్య
సులభకాఠిన్యవిస్ఫురణ మెట్లనిన
నేను నేనని పండి నిండినదెఱుక
నేనని సులభమౌ నెఱిఁగహంకృతిని
నేననఁ గఠినమౌ నిశ్చయమందుఁ
గాన నీబంధమోక్షంబులు రెండు
వలనొప్పఁగలవని వచియింపవలసె
నలకంటఁగని నిశ్చయంబు భావించి
ఆబంధమోక్షంబు లభ్రముల్గాని
యాబంధమోక్షంబు లాత్మకెక్కడిది
నిత్యముక్తుం డాత్మ నిర్గుణుండనెడి
సత్య మూహించిన సంకల్ప మేది
ప్రాకటముగ నిట్టి భావనిశ్చయము
నీకు లభ్యంబయ్యె నెఱిఁగన్న తల్లి
ఇరువుగ మఱియు నింకెన్ని చెప్పినను
నిరుపమానందమౌ నిశ్చల మొకటి

పరగ నీనిశ్చయభావంబుచేత
నరయక పరమాత్మ నంచు భావించు
భానుప్రకాశ మంబరమెల్ల నిండి
పూనియుండియును సద్భూరికాంతియొగి
స్ఫుటముగఁ గనరాక భూవృక్షశైల
ఘటపటాద్యాకారఘనమౌ వెలుంగు
సరణిఁ బరాత్ముఁ డాసనముననుండి
కరణాదులందుం బ్రకాశించుచుండు
సంతతం బీరహస్యము భావమందుఁ
జింతింపుచుండు సుస్థిరముగ జనని
ఇలభానుఁ డస్తాద్రి కేఁగినవేళ
కళలచే వెల్గుఁ దక్కక జాలమెల్ల
అమర నాతనియందు ననువొందుమాడ్కి
నమనస్కమున నడఁగా విశ్వమెల్ల

గనుక యీయమనస్క ఘనతరాభ్యాస
మున నీవు పరిపూర్ణముగ నిండియుండు
మానసమున వేంకమాంబికరచిత
మైననట్టి రాజయోగామృతసార
మందెన్నఁగాఁ దృతీయప్రకరణము
పొందుగఁ దఱికుండపురిధాముఁ డైన
వీరనృసింహుఁడు వెలయఁ గైకొనియె
ధారుణి నాచంద్రతారార్కముగను.

రాజయోగసారము తృతీయప్రకరణము
సంపూర్ణము